RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 26 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ శుక్రవారం 01-05-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి
TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
The Voice of Telangana

**విలేకరులు కావలెను**

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

**9182328292**



## మధ్య ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

**15 మంది మృతి, మరో 30 మందికి గాయాలు**

హైదారాబాద్ : మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో 15 మంది మృతి చెందగా 30 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన ధార్ జిల్లాలోని ఇండోర్–అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. కూలీలను తీసుకెళుతున్న వ్యాన్ బోల్తా పడి మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15 మంది అక్కడికక్కడే చనిపోగా.. 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ధార్ జిల్లాలోని బగ్గడ్ నుంచి 35 మంది కూలీలు పికప్ వ్యాన్‌లో ఇంటికి వస్తున్నారు.

2వ పేజీలో...

## నేనసలే మంచి వాడిని కాను



2వ పేజీలో...

**ఇరాన్ అణు ఒప్పందానికి రావాల్సిందే అప్పటి వరకు శాంతి ఒప్పందం కుదరదు మరోమారు హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

వాషింగ్టన్, :దాదాపు రెండు నెలలుగా కొనసాగుతున్న ఘర్షణను ముగించాలనే ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించాలంటే తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. అప్పటివరకు ఇరాన్‌పై అమెరికా నౌకా దిగ్బంధనం కొనసాగు తుందని హెచ్చరించారు బుధవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. ఇరాన్ యుద్ధం గురించి మాట్లాడారు. 'బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది.



## 35 ఏళ్ల సుదీర్ఘ జాప్యం..

**పోలీసు అధికారిపై**

## క్రిమినల్ కేసు కొట్టివేత

2వ పేజీలో...



## త్వరలో ట్రైబల్ వర్సిటీ క్యాంపస్ నిర్మాణం

**రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు ప్రధాని పర్యటనపై కిషన్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్,ఏప్రిల్30 : సమ్మక్క- సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మే 10న హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి ఈమేరకు మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి టెర్మినల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. మహబూబ్‌నగర్‌లో రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు. హఫీజ్‌పేట, జోగులాంబ రైల్వేస్టేషన్లను, కాజీపేట- విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో రూ.85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్–యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమయ్యాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని కిషన్‌రెడ్డి తెలిపారు.



## రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన

2వ పేజీలో...



## కదిలే కారులో మంటలు.. అయిదుగురు సజీవదహనం

అల్వార్: ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదం జరిగింది. కదులుతున్న కారులో మంటలు వ్యాపించాయి. దీంతో దాంట్లో ప్రయాణిస్తున్న అయిదుగురు సజీవదహనమయ్యారు. ఈ ఘటన రాజస్థాన్ లోని అల్వార్ జిల్లాలో జరిగింది. బుధవారం రాత్రి మౌజ్‌పూర్ వద్ద ఈ ఘటన జరిగినట్లు పోలీసులు చెప్పారు. కారులో ఉన్న ప్రయాణికులు.. వైష్ణవీదేవి ఆలయాన్ని సందర్శించి తిరిగి వస్తున్నారు. అదనపు ఎస్పీ ప్రియాంకా రఘువంశీ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన ప్రాంతానికి అగ్నిమాపక సిబ్బందిని పంపామన్నారు. 15 నిమిషాల్లోనే మంటల్ని అదుపులోకి తెచ్చినట్లు చెప్పారు. కానీ అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైందన్నారు. మృతిచెందిన వారిలో ముగ్గురు మహిళలు, ఓ మైనర్ బాలిక, మరొకరు ఉన్నట్లు గుర్తించారు. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్ జిల్లాకు చెందిన నివాసితులుగా వారిని అనుమానిస్తున్నారు. బహుశా షార్ట్ సర్క్యూట్ వల్ల కారులో మంటలు వ్యాపించి ఉంటాయని డిప్యూటీ ఎస్పీ కైలాశ్ జిందాల్ తెలిపారు. సీఎన్‌జీ వాహనం కావడం వల్ల షార్ట్ సర్క్యూట్ కోణంలో ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నామన్నారు. చాలా వేగంగా కారులో మంటలు వ్యాపించాయని, ప్రయాణికులకు తప్పించుకునే సమయం కూడా దొరకలేదన్నారు. వాహనం నుంచి కేవలం కళేబరాలను వెలికితీసినట్లు చెప్పారు. వారిని గుర్తుపట్టేందుకు డీఎన్‌ఏ పరీక్షలు చేపట్టనున్నారు. కారు డ్రైవర్ వినోద్ కుమార్ వాహనం నుంచి బయటకు దూకాడు. కానీ అతని శరీరం 80 శాతం కాలింది. ఈ ఘటనపై మరింత దర్యాప్తు చేపట్టనున్నారు.



## 32 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో జ్ఞాపకాలు.. మరెన్నో అనుభవాలు

**తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి**





2వ పేజీలో...

## తమిళనాడులో విజయ్ పార్టీ కీలకం కానుందా?

- మే 4న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- డీఎంకే గెలుస్తుందని అంచనా వేసిన అత్యధిక సర్వేలు
- మెజారిటీకి స్వల్ప దూరంలో నిలుస్తుందని మరికొన్ని సర్వేల అంచనాలు
- దీనితో విజయ్‌తో సంప్రదింపులకు అన్నాడీఎంకే ప్రయత్నిస్తున్నట్లు కథనాలు

చెన్నై: 234 స్థానాలు కలిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చే నెల 4వ తేదీన వెల్లడి కానున్నాయి. ఎగ్జిట్ పోల్ సరళిని చూస్తే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే మరోసారి అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. కొన్ని సర్వేలు డీఎంకే మేజిక్ ఫిగర్‌కు కొద్ది దూరంలో ఉంటుందని అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీతో సంప్రదింపులు జరపడానికి సిద్ధమైనట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. డీఎంకే, అన్నాడీఎంకేలు మేజిక్ ఫిగర్‌కు దగ్గరగా ఆగిపోతే, విజయ్ పార్టీ కీలకంగా మారుతుందని భావిస్తున్నారు. విజయ్ పార్టీకి 4 నుంచి 30 సీట్ల వరకు వస్తాయనే అంచనాలు వెలువడ్డాయి. యాక్సిస్ మై ఇండియా ఒక్కటే టీవీకే పార్టీ 98 నుంచి 120 సీట్ల వరకు గెలుచుకుంటుందని తెలిపింది.

## సోషల్ మీడియా తీర్పే ఫైనలా..?

- అన్‌ఫాలోలే రాజకీయ భవిష్యత్తుకు సంకేతమా..?
- రాఘవ్ చద్దాకి కొత్త పరీక్ష..
- పార్టీ మారిన కొన్ని గంటల్లోనే ఇన్‌స్టాలో 10 లక్షలకు పైగా అన్ ఫాలో...
- చెడ్డ రాజకీయాలు..! ఫేక్ ఫాలోవర్లను క్రియేట్ చేసే ప్రయత్నాలు...

ఉదయ్ కుమార్. జి
DAE, BA, BCJ, MCJ, LLB, MPhil., PhD
సీనియర్ జర్నలిస్టు
ఫోన్ నెంబర్ 8367603197

2వ పేజీలో...




దేశ రాజకీయాల్లో యువ నాయకత్వానికి ప్రతీకగా ఎదిగిన రాఘవ చద్దా తాజా పరిణామాలతో మరోసారి చర్చల్లో నిలిచారు. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి భారతీయ జనతా పార్టీలో చేరిన కొద్ది గంటల్లోనే సోషల్ మీడియా (ఇన్‌స్టాగ్రామ్) 10 లక్షలకుపైగా ఫాలోవర్స్ అన్‌ఫాలో చేయడంపై రాజకీయంగా చర్చనీయాంశమైంది. దీనిని కేవలం డిజిటల్ పరిణామంగా గాక ప్రజాభిప్రాయంలో వచ్చిన ప్రతిస్పందనగా భావించాల్సిన పరిస్థితి. నేటి రాజకీయాల్లో సోషల్ మీడియా ప్రజా అనుసంధానానికి నాయకులకు ప్రధాన వేదికగా మారిన నేపథ్యంలో, ఈ తరహా భారీ అన్‌ఫాలోలు విశ్వాసంలో వచ్చిన చీలికను స్పష్టంగా చూపిస్తున్నాయి. చద్దా ఎదుగుదలకు యువతే ప్రధాన బలం. పార్లమెంటరీ చర్చల్లో చురుకుదనం, మీడియా కమ్యూనికేషన్ నైపుణ్యం, పట్టణ యువతతో సాన్నిహిత్యం వంటి అంశాలు అతనికి ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. అలాంటి నాయకుడిపై ఒక్కసారిగా డిజిటల్ వ్యతిరేకత వెల్లువెత్తడం, యువత రాజకీయ ఆలోచనల్లో వస్తున్న మార్పుకు సంకేతంగా చూడాలి.

## మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

మొదటిపేజీ తరువాయి...

బుధవారం రాత్రి 8.30గంటల ప్రాంతంలో చిక్లియా క్రాసింగ్ దగ్గర డ్రైవర్ వ్యాన్ కంట్రోల్ కోల్పోయాడు. దీంతో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఆ వెంటనే ఎదురుగా వస్తున్న ఎస్‌యూవీని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 15 మంతిమృత్యువాతపడ్డారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. సంఘటనస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కాగా, ఈ ప్రమాదంపై మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ స్పందించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.4లక్షలు,తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. బాధితులకు అండగా ఉంటామని, సహాయక చర్యలు ముమ్మరం చేయాలనిఅధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

## తమిళనాడులో విజయ్ పార్టీ కీలకం కానుందా?

మొదటిపేజీ తరువాయి...

యాక్సిస్ మై ఇండియా అంచనాల ప్రకారం విజయ్ పార్టీ 98 నుంచి 120 సీట్లు గెలుచుకుని, డీఎంకే నేతృత్వంలోని కూటమితో సమానంగా నిలుస్తుందని తెలిపింది. డీఎంకే – కాంగ్రెస్ కూటమి 92 నుంచి 110 సీట్లు, ఎన్డీయే 22 నుంచి 32 సీట్లు గెలుచుకుంటాయని అంచనా వేసింది. ముఖ్యమంత్రి పదవికి విజయ్ అత్యంత ప్రాధాన్యత కలిగిన అభ్యర్థిగా 37 శాతం మద్దతుతో నిలిచారని, 35 శాతం మద్దతుతో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కంటే స్వల్పంగా ముందున్నారని కూడా ఈ ఎగ్జిట్ పోల్ తెలిపింది. యువ ఓటర్లలో టీవీకేకు బలమైన మద్దతు ఉందని వెల్లడించింది. 18 నుంచి 19 ఏళ్ల మధ్య వయసున్న తొలిసారి ఓటు వేస్తున్న వారిలో 68 శాతం, 20 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న వారిలో 59 శాతం, 30 నుంచి 39 ఏళ్ల మధ్య వయసున్న వారిలో 45 శాతం మద్దతు విజయ్‌కి ఉందని సర్వే అంచనా వేసింది.

## రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన

మొదటిపేజీ తరువాయి...

దేవరకొండ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని విభాగాల్లో అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం కోల్ ముంతల్ పహాడ్ రైతు వేదిక వద్ద రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజం బాగుండాలంటే విద్య అవసరమని, పేదవారికి ఉచితంగా చదువు చెప్పాలనే ఉద్దేశంతోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. “దేవరకొండకు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 కోట్లు ఇచ్చాం. ఎల్‌వోసీ పెట్టుకుంటే 24 గంటల్లో అప్రూవ్ చేస్తున్నాం. తొందర్లోనే ఎస్‌ఎల్‌బీసీ సొరంగం నిర్మాణం పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు మండలాలను సస్యశ్యామలం చేస్తాం” అని అన్నారు.

# సోషల్ మీడియా తీర్పే ఫైనలా..?

మొదటిపేజీ తరువాయి...

పార్టీ మార్పు రాజకీయాల్లో సాధారణమే అయినప్పటికీ, సిద్ధాంతపరమైన స్పష్టత లేకుండా జరిగితే అదిఅవకాశవాదంగాముద్రపడే ప్రమాదం ఉంది. ఈ సందర్భంలో అన్‌ఫాలోల సంఖ్య, యువతలో పెరుగుతున్న విలువాధారిత రాజకీయ అవగాహనను ప్రతిబింబిస్తోంది.

రాజకీయ నమ్మకానికి తక్షణ కొలమానంగా సోషల్ మీడియా ..: సోషల్ మీడియా ఇప్పుడు కేవలం ప్రచార సాధనం కాదు, అది రాజకీయ నమ్మకానికి తక్షణ కొలమానం. ఎన్నికల ముందు సర్వేలు, జనసభలు ఎంత ప్రాధాన్యం కలిగి ఉన్నాయో, ఇప్పుడు డిజిటల్ స్పందన కూడా అంతే ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా పట్టణ, మధ్యతరగతి, చదువుకున్న యువతలో అభిప్రాయాల మార్పు వేగంగా ప్రతిఫలిస్తోంది. ఒక నాయకుడి నిర్ణయం నచ్చకపోతే వెంటనే అన్‌ఫాలో చేయడం ద్వారా అసమ్మతి వ్యక్తం చేసే సంస్కృతి బలపడుతోంది. ఇది భవిష్యత్ రాజకీయ ప్రచార శైలిని కూడా మార్చే సూచన.

ప్రజా విశ్వాసంతో ముడిపడుతున్నాయి...: జాతీయ రాజకీయాల దృష్టిలో ఈ పరిణామం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. పార్టీ మార్పులు ఇప్పటి వరకు వ్యూహాత్మకంగా మాత్రమే పరిగణించబడ్డాయి. కానీ ఇప్పుడు అవి ప్రజా విశ్వాసంతో ముడిపడుతున్నాయి. ఒకవైపు పాత మద్దతుదారులు దూరమవడం, మరోవైపు కొత్త పార్టీలో పూర్తి స్థాయి ఆమోదం ఆలస్యమవడం రెండు పడవల మధ్య పరిస్థితిని సృష్టించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పంజాబ్ వంటి ప్రాంతాల్లో చద్దా వ్యక్తిగత ఇమేజ్ దెబ్బతింటే, అది స్థానిక రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపేఅవకాశం ఉంది. అయితే సోషల్ మీడియా ప్రతిస్పందనలను పూర్తిగా తుది తీర్పుగా పరిగణించడం సరైంది కాదు. రాజకీయాల్లో సంస్థాగత బలం, కేడర్ మద్దతు, నాయకత్వానికి దగ్గరదనం, వ్యూహాత్మక ప్రాధాన్యత వంటి అంశాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తాయి. అయితే బీజేపీ వంటి జాతీయ పార్టీలో నాయకుడి స్థానం కేవలం ఫాలోవర్స్ సంఖ్యలపై ఆధారపడదు. కానీ డిజిటల్ ప్రతికూలతను నిర్లక్ష్యం చేయడం కూడా ప్రమాదకరం.

విశ్వాసం కోల్పోవడం క్షణాల్లోనే.. నిలబెట్టుకోవడమే కష్టం...: ఏది ఏమైనప్పటికీ ప్రజల విశ్వాసం సంపాదించడం కష్టం, కోల్పోవడం మాత్రం క్షణాల్లో జరుగుతుందన్న విషయాన్ని తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో చద్దా అన్‌ఫాలోల ఘటన ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. డిజిటల్ యుగంలో నాయకులు తీసుకునే ప్రతి నిర్ణయం వెంటనే ప్రజా పరిశీలనకు లోనవుతోందని తెలియజేసింది. కాబట్టి స్పష్టమైన రాజకీయ ధోరణి, విలువలపైన నిలబడే ధైర్యం, ప్రజలతో నిరంతర కమ్యూనికేషన్ వంటివే భవిష్యత్ నాయకత్వానికి పునాది. చద్దా గానీ మరెవరైనా గానీ ముఖ్యంగా సోషల్ మీడియాను ప్రధాన వేదికగా చేసుకుని రాజకీయాల్లో ఎదిగే వారి ముందు ఉన్న సవాలు కూడా ఇదే. డిజిటల్ దూరాన్ని తగ్గించి, వాస్తవ రాజకీయాల్లో తన స్థిరత్వాన్ని నిరూపించగలగడం. చద్దా విషయంలో అదే జరిగితే ఈ అన్‌ఫాలోల తుఫాను తాత్కాలికమే అవుతుంది; లేకపోతే అది రాజకీయ ప్రయాణంలో దీర్ఘకాల ప్రభావం చూపే మలుపుగా మిగిలిపోతుంది.



చెడ్డ రాజకీయాలు..! ఫేక్ ఫాలోవర్లను క్రియేట్ చేసే ప్రయత్నాలు..: అయితే రాఘవ్ చద్దా తన ఇన్‌స్టా లో అన్ ఫాలో అయిన వారి సంఖ్యను కొంత వరకైనా రికవర్ అయినట్లు చూపించుకుని తనకు ప్రజాధరణ తగ్గలేదని నిరూపించుకోవడం కోసం నానా తంటాలు పడుతున్నారు. ఫేక్ ఫాలోవర్లను క్రియేట్ చేస్తున్నారని తాజాగా కొందరు అతని ఫేక్ లేదా కృత్రిమంగా తయారు చేస్తున్న ఫాలోవర్ల వివరాలను వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల ద్వారా నిరూపిస్తుండడం అతని ఇమేజ్‌ను మరింత డామేజ్ చేస్తోంది.

## చిన్నారుల అక్రమ రవాణా..
## హైదరాబాద్‌లో గుజరాత్ పోలీసుల తనిఖీలు

హైదరాబాద్: చిన్నారుల అక్రమ రవాణా కేసుకు సంబంధించి గుజరాత్ పోలీసులు హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రుల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ కేసులో మురుగన్ గ్యాంగ్‌ను ఇప్పటికే గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారంతో గుజరాత్ పోలీసులు హైదరాబాద్‌కు వచ్చారు. మురుగన్ గ్యాంగ్‌కు ఇక్కడ ఎవరెవరు సహకరించారనే దానిపై సోదాలు నిర్వహించారు. కూకట్‌పల్లి, బంజారాహిల్స్, సికింద్రాబాద్‌లోని కొన్ని ఫెర్టిలిటీ సెంటర్‌లలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. కొంత సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. గతేడాది ఆదిలాబాద్ జిల్లాలోని ఓ ఇటుకల బట్టీలో మురుగన్ కార్మికుడిగా పనిచేస్తూ చిన్నారులను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు విక్రయించాడు. దీంతో అరెస్టు అయ్యి మూడు నెలల తర్వాత విడుదల అయ్యాడు. గతేడాది వెలుగుచూసిన చైతన్యపురి పీఎస్‌లో నమోదైన కేసులోనూ మురుగన్ పేరు బయటకు వచ్చింది. మురుగన్ భార్య కృష్ణవేణి ఇంకో గ్యాంగ్‌ను నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు మురుగన్ గ్యాంగ్‌ను ఇప్పటికే గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లో దాడులు చేపట్టినట్లు తెలుస్తోంది. మురుగన్ గ్యాంగ్ ఒక్క ఏడాదిలో 25 మంది చిన్నారులను విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. అతడు దేశవ్యాప్తంగా చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాను ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేనసలే మంచి వాడిని కాను

మొదటిపేజీ తరువాయి...

వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ స్పష్టం చేశారు . కాగా, శాంతి ఒప్పందానికి అంగీకరించేలా ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది (జా ఎసజీని బిIనిబతినీనిబ). అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా–ఇరాన్ మధ్య ప్రస్తుతానికి శాంతి చర్చలు జరగడం లేదు. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను మరోసారి తీవ్రంగా బెదిరించారు. నిలిచిపోయిన అణు కార్యక్రమం చర్చలపై ఇరాన్ త్వరగా తేల్చాలని, తెలివిగా వ్యవహరించాలని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో తుపాకితో ఉన్న ఫొటోను పోస్టు చేశారు. దీంతో ఇది నెట్టింట వైరల్ అయింది. యుద్ధం ముగిసిన తరువాతే అణు కార్యక్రమంపై చర్చలని ఇరాన్ తేల్చి చెప్పిన నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన పోస్ట్‌లో, 'ఇరాన్ తమ పనిని సరిగ్గా చేయ లేకపోతోంది. వారికి అణురహిత ఒప్పందంపై ఎలా సంతకం చేయాలో తెలియదు. వారు త్వరగా తెలివిగా వ్యవహరించాలి!' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌తో పాటు, ట్రంప్ తన ఎఐ రూపొందించిన చిత్రాన్ని కూడా పంచుకున్నారు, అందులో ఆయన అసాల్ట్ రైఫిల్‌ను పట్టుకొని ఉండగా, వెనుక పర్వత ప్రాంతంలో బాంబులు పేలుతున్నాయి. ఆ చిత్రంపై 'నో మోర్ మిస్టర్ నైస్ గై-(ఇకపై మంచివాడిగా ఉండను!) అని బ్యానర్ ఉంది. అమెరికా–ఇరాన్ మధ్య ఉన్న సున్నితమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ బెదిరింపులకు దిగడం గమనార్హం. ఇరాన్ ఓడ రేవులను దిగ్బంధించాలని ట్రంప్ ఆదేశించారని వాల్ స్ట్రీట్ జర్నల్ బుధవారం నివేదించింది. ఈ కథనం ప్రకారం ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశ ఓడరేవులను సుదీర్ఘకాలం పాటు దిగ్బంధించడానికి సిద్ధం కావాలని ట్రంప్ జాతీయ భద్రతా అధికారులను ఆదేశించారు. ఇరాన్ చిత్తశుద్ధితో చర్చలు జరపడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. ఇరాన్ తన యురేనియం శుద్ధిని 20 ఏళ్ల పాటు నిలిపివేసేలా, ఆ తర్వాత కఠినమైన ఆంక్షలను అంగీకరించేలా బలవంతం చేయాలని ఆయన ఆశిస్తున్నారని ఆ కథనం తెలిపింది. అమెరికా తమ దేశ నౌకలను స్వాధీనం చేసుకోవడాన్ని ఇరాన్ సముద్రపు దొంగతనంగా అభివర్ణించింది. ఈ వివాదంపై ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌కు, భద్రతా మండలికి ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవాని అధికారికంగా ఫిర్యాదు చేశారు. అమెరికా చర్యలు అంతర్జాతీయ వాణిజ్యంలో చట్టవిరుద్ధమైనవని ఆయన పేర్కొన్నారు.

# పోలీసు అధికారిపై క్రిమినల్ కేసు కొట్టివేత



ఢిల్లీ,: న్యాయ విచారణలో జరిగే అసాధారణ జాప్యంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఏకంగా 35 ఏళ్ల పాటు విచారణ పెండింగ్‌లో ఉన్న ఓ క్రిమినల్ కేసును అత్యున్నత న్యాయస్థానం చివరకు కొట్టివేస్తున్నట్లుగా ప్రకటించింది. త్వరితగతిన విచారణ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్–21 ప్రకారం ప్రతి పౌరుడికి ఉన్న ప్రాథమిక హక్కు అని, సంబంధిత కేసులో ఆ హక్కు తీవ్రంగా ఉల్లంఘించబడిందని కోర్టు స్పష్టం చేసింది.

ధర్మాసనం కీలక వ్యాఖ్యలు..: ఓ పోలీసు అధికారిపై దశాబ్దాల

మొదటిపేజీ తరువాయి...

క్రితం నమోదైన ఈ కేసు విచారణ వివిధ కారణాల వల్ల 35 ఏళ్లుగా సాగుతూనే ఉంది. దీనిపై సదరు అధికారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా ఈ సుదీర్ఘ కాలంలో నిందితుడు ఎదుర్కొన్న మానసిక ఆందోళన, వ్యక్తిగత ఇబ్బందులను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కేసు విచారణలో దశాబ్దాల తరబడి జాప్యం జరగడం వల్ల నిందితుడికి రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా హక్కుకు భంగం కలిగిందని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. కేసు విచారణ ఆలస్యం కావడానికి నిందితుడు ఎక్కడా కారణం కాలేదని, ప్రాసిక్యూషన్ వైఫల్యం వల్లే ఈ జాప్యం జరిగిందని కోర్టు గుర్తించింది. ఇన్నేళ్ల తర్వాత విచారణ కొనసాగించినా సరైన సాక్ష్యాధారాలు లభించడం కష్టమని, సాక్షుల జ్ఞాపకశక్తి కూడా తగ్గిపోయే అవకాశం ఉంటుందని కోర్టు పేర్కొంది. ఓ వ్యక్తిని దశాబ్దాల పాటు కోర్టుల చుట్టూ తిప్పడం తగదని పేర్కొంటూ, సదరు పోలీసు అధికారిపై ఉన్న అన్ని క్రిమినల్ చర్యలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

# ఎఐ,ఐటిలపై పట్టు సాధించాలి

## లేకుంటే వెనకబడి పోతాం
## మంత్రులకు సిఎం బాబు హితవు

అమరావతి, ఏప్రిల్30 :కృత్రిమ మేధ, ఐటీపై మంత్రులు పరిజ్ఞానం పెంచుకోకుంటే వెనుకబడ తారని సీఎం చంద్రబాబు అన్నారు. క్యాబినెట్ భేటీలో అజెండా అంశాలు ముగిశాక మంత్రులతో తాజా పరిణామాలపై చర్చించారు. గూగుల్‌ని రాష్ట్రానికి తెచ్చే క్రమంలో చోటుచేసుకున్న వివిధ పరిణామాలను గుర్తుచేసుకున్నారు. అమెరికా పర్యటనలో గూగుల్ ప్రతినిధులను మంత్రి లోకేశ్ కలిసి ఒప్పించిన తీరును వివరించారు.'జలధార–జలహారతి'కార్యక్రమంలో మంత్రుల భాగస్వామ్యం ఉండేలా చూడాలని నిమ్మల రామానాయుడుకు సూచించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 'సూర్యఘర్' లక్ష్యాల కోసం ఇంకా కృషి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికి సూచించారు. సింగపూర్ పర్యటనకు వెళ్లొచ్చిన మంత్రులు.. అక్కడి అధ్యయనాలపై వ్యక్తిగతంగా నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పుట్టపర్తి వద్ద ఏరోస్పేస్ డిఫెన్స్ క్లస్టర్‌కు వేగంగా అనుమతులు రావటం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో



భాగమన్నారు. అమరావతి నిర్మాణాలపై గొడ్డలి పార్టీ విమర్శలను దీటుగా తిప్పికొట్టాలన్నారు. నిర్మాణ ఖర్చులపై దుష్ప్రచారాలను ఎండగడుతూ వాస్తవాలు చెప్పాలి. వైకాపా అసత్య ప్రచారాలను ఎక్కడికక్కడ నియంత్రించాలి. ఇటీవల తలెత్తిన ఇంధన సమస్యపైనా ప్రజలకు వివరించాలి. మంత్రుల సింగపూర్ పర్యటనపై విమర్శలను గట్టిగా తిప్పికొట్టాలి. సింగపూర్‌లో అధ్యయనం చేసిన ఉత్తమ విధానాలు అందరికీ చెప్పాలని సూచించారు.

# 32 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో జ్ఞాపకాలు..

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్: తన 32 ఏళ్ల పోలీస్ జీవితంలో అనేక అనుభవాలు, జ్ఞాపకాలు మిగిలాయని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా హైదరాబాద్ పోలీస్ అకాడమీలోని పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు ఉన్నతాధికారులు గౌరవ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాత పోలీసింగ్ విధానాలతో పోలిస్తే ఇప్పటి పరిస్థితుల్లో పెద్ద మార్పులు వచ్చాయని అన్నారు. పోలీస్, ప్రజల మధ్య దూరం తగ్గించేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పోలీసింగ్ చేపట్టినట్లు చెప్పారు. డీజీపీగా అవకాశం ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యువ పోలీస్ అధికారులు శాఖకు మంచి పేరు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కొత్త డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్‌కు అభినందనలు తెలిపారు.

విశిష్ట సేవలు అందించారు: సీవీ ఆనంద్

పదవీ విరమణ పొందుతున్న డీజీపీ శివధర్‌రెడ్డికి, నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ అభినందనలు తెలిపారు. 32 ఏళ్లపాటు శివధర్‌రెడ్డి ప్రజలకు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో కీలకంగా పని చేశారని, ఎన్‌కౌంటర్లు,



మావోయిస్టుల సరెండర్‌లో కీలక పాత్ర పోషించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆపరేషన్ కగార్ విజయవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. “భారీగా మావోయిస్టుల ఆయుధాల స్వాధీనం, లొంగుబాటు సాధన కోసం కృషి చేశారు. తెలంగాణ గౌరవాన్ని కాపాడటం పోలీసు బాధ్యతగా పేర్కొన్నారు. 2016 నుంచి కలిసి పలువురు అధికారులతో కలిసి పని చేశా. వారి సూచనలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాను” అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# కొబ్బరి చెట్టు వివాదంలో ఘర్షణ.. ఒకరికి తీవ్రగాయాలు



రుద్రంపూర్, ఏప్రిల్ 30 : కొబ్బరి చెట్టు కాయలు పడి ఇళ్ల రేకులు పగలడమే కాకుండా పిల్లలకు గాయాలైన నేపథ్యంలో ప్రారంభమైన వివాదం చివరకు ఘర్షణగా మారి వ్యక్తులపై దాడికి దారితీసిన ఘటన బుధవారం అర్ధరాత్రి చుంచుపల్లి మండలం ధన్బాద్ పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధన్బాద్ పంచాయతీ పరిధిలో నివసిస్తున్న గుంటి భాస్కర్ కుటుంబం పక్కనే ఉన్న పూల రవీందర్ ఇంటి వద్ద ఉన్న కొబ్బరి చెట్టు కాయలు తరచుగా పడి భాస్కర్ ఇంటి పైకప్పు రేకులు పగలడమే కాకుండా ఇంట్లో ఉన్న పిల్లలకు గాయాలు కావడంతో చెట్టును తొలగించాలని గత కొన్ని రోజులుగా ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదాలు కొనసాగుతున్నాయి. ఈ విషయంపై ఇరువురు కుటుంబాలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇటీవల కొత్తగూడెం డీఎస్పీ ఆధ్వర్యంలో ఇరువురికి కౌన్సిలింగ్ కూడా నిర్వహించారు. అయితే బుధవారం అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో పూల రవీందర్, నాగరాజు, అనిల్, జీవన్, కార్తీక్ అనే వ్యక్తులు గుంటి భాస్కర్ ఇంట్లోకి ప్రవేశించి విచక్షణారహితంగా దాడి చేయడంతో భాస్కర్ తలకు తీవ్ర గాయాలు కాగా, రుంజ అభిలాష్, గుంటి లక్ష్మి కూడా గాయపడ్డారు. రుంజ అభిలాష్ ఫిర్యాదు మేరకు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ డి. ప్రతాప్, సబ్ ఇన్‌స్పెక్టర్ కిశోర్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ కిశోర్ తెలిపారు.

# సంపాదకీయం

## శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న పాలకులు !

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. కార్మిక లోకాన్ని తట్టి లేపిన విప్లవకారుడు శ్రీశ్రీ. అయితే దేశంలో ఐటి విప్లవం వచ్చిన తరవాత పాలకులు కార్మికులను పట్టించుకోవడం మానేశారు. నేటికీ వారి బతుకులు ఛిద్రం అవుతున్నా కనీసం పలకరింపులు, సానుభూతి వచనాలు లేవు. ఇప్పుడు కార్మికులంటే కేవలం కర్మాగారాల్లో పనిచేస్తున్నవారే కాదు. రోడ్డుమీద పడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కార్మికులే. వారికి ముఖ్యంగా ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదు. ఆకాశ హర్మ్యాలను కడుతున్నా.. కుటుంబానికి దూరంగా ఊడిగం చేస్తున్నా కూలీ తప్ప పెద్దగా ప్రయోజనాలు కలగడం లేదు. వీరందరికీ ప్రధానంగా ఆరోగ్య వసతి, పెన్షన్ పథకాలు కలగాలి. పనిచేసే ప్రతి ఒక్కరినీ కార్మికులుగా చూడాలి. వారికి విద్య,ఆరోగ్య, పెన్షన్ భద్రత వంటి కనీస సౌకర్యాలు కలగాలి. అలాగే అసంఘటిత కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. పాలకులంతా ఎసి కార్లలో, విమానాల్లో తిరుగుతూ.. ఎసి బంగలాల్లో నివస్తున్నారు. వీరికి సామాన్యుల కష్టాలు తెలియడం లేదు. ప్రజలు కట్టిన పన్నులతో జల్సాలు చేస్తున్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురవుతోంది. శ్రామికుడు దోపిడీకి గురవుఉతన్నాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. కష్టించి పని చేసే చేతులు పిడికిళు బిగిస్తాయని గుర్తించాలి. ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది. ముఖ్యంగా మేడే రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపు ఇచ్చి వారిని సన్మానించడం చేస్తున్నాం. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మే డే పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. మనదేశంలో అసంఘటిత రంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. నిర్మాణ, వ్యవసాయ, గిర కార్మిక రంగాలు పూర్తిగా వెలివేయ వడ్డాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. సామాజిక న్యాయం, అందరికీ గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి పాలకులు ముందుకు రావాలి. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయి స్తున్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న విద్యావంతులైన యువత శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఇప్పుడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. అందుకే అనేక సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. అందుకే ప్రైవేట్ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు. ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైనవి శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

### విద్యార్థుల భవిష్యత్ బలపడే దిశగా..

# ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది

### ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్





దేవరకొండ (తెలంగాణ వాణి ప్రతినిధి): దేవరకొండ నియోజకవర్గం లోని కొండల్లేపల్లి మండలం కోల్ ముంతల్ పహాడ్ గ్రామ రైతు వేదిక వద్ద 20 ఎకరాల్లో 200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శాసన మండలి సభ్యులు గుత్తా సుఖేందర్ రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ తో కలిసి శంకుస్థాపన చేసిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ మా ప్రభుత్వం "విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం" అన్న నమ్మకంతో, రాష్ట్రంలోని విద్యావ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తోంది. దేవరకొండలో నిర్మిస్తున్న ఈ స్కూల్ భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా, ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో, దేవరకొండలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ ప్రాజెక్ట్‌ను వేగంగా ముందుకు తీసుకొని రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు ఎ. రేవంత్ రెడ్డి తో కలిసి ప్రారంభం చేసుకుందాం అని అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు క్యాంపస్‌లోనే ఉండే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి, క్రీడా కార్యక్రమాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని ఈ సమగ్ర ఇంటిగ్రేటెడ్ స్కూల్ మోడల్ తెలంగాణ ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనం. పనులు వేగంగా సాగేందుకు ప్రతి 15 రోజులకు నిధులు విడుదల చేస్తున్నాం అని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే డైట్ చార్జీలను 40%, కాస్మెటిక్ చార్జీలను 200% పెంచి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకున్నాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలు తెలుసుకునే విధానాన్ని అమలు చేస్తున్నాం. గ్రామీణ రహదారి సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రజల ప్రయాణ సౌలభ్యం పెరుగుతుందని, అలాగే స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఇది ఊతమిస్తుందని ఆయన పేర్కొన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారులు అందుబాటులోకి రావడం వల్ల రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేవరకొండలో ఉన్న 100 పడకల ఆసుపత్రిని 200 పడకలుగా చేయాలని మంత్రి ని కోరారు. దేవరకొండలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు అన్ని త్వరితగతిన పూర్తి చేసి రైతంగానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది. కొండమల్లేపల్లి గ్రామంలోని కస్తూర్భ గాంధీ బాలికల విద్యాలయంలో 80. 00 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.

ఈ కార్యక్రమంలో నల్గొండ మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి రామ్మోహన్,మన్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు,వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్లు నాయిని జమున మాధవరెడ్డి, దొంతం అలివేలు సంజీవరెడ్డి, ఆర్డిఓ రమణా రెడ్డి , డీఈవో ,కోల్ ముంతల్ పహాడ్ గ్రామ సరస్వతి రవినాయక్ ,సర్పంచ్ యుగేందర్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ మెగా ఇంజనీరింగ్ సంస్థ లక్ష్మారెడ్డి,సేస్ ,డ ఈ డబ్ల్యూ ఐడిసి, నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేట్ సిరాజ్ ఖాన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మండల మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు,మండల పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే కార్మిక హక్కులకు రక్షణ

### కార్పోరేట్ సంతుష్టీకరణలో పాలకులు
### అనేక ఆందోళనతో అడ్డుకుంటూనే ఉన్నాం
### సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు

విజయవాడ, ఏప్రిల్30 :ప్రభుత్వాలు కార్మికుల హక్కులపైనే కాక జీవితాలపైన, ప్రజాస్వామ్య హక్కులపైన, రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తున్నాయి. ఈ హక్కులను కాపాడుకోవడానికి యావత్ కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. లేబర్‌కోడ్లను రద్దు చేయాలని, కార్మిక హక్కులు అమలు కావాలని అన్నారు. నిరంతరం కార్మిక దోపిడీ జరుగుతున్నా పాలకుల్లో చలనం లేదన్నారు. ఏటేటా మేడేలు జరుపుకోవడం తప్ప కార్మికుల పక్షాన నిర్ణయాలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన చెందారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకై మానవ హారాలు, పాదయాత్రలు, మహాప్రదర్శనలు నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదు సంవత్సరాలుగా రాజీ లేని పోరాటాలు సాగుతున్నాయి. వీటి ఫలితంగా నేటి వరకూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ముందుకు సాగలేకపోయిందన్నారు. అయితే దానిని అభివృద్ధి చేసి, దానికి గనులు కేటాయించి, మరింత పటిష్టంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం లేదన్నారు. తిరుపతి టిటిడి ఫారెస్టు కార్మికులు 38 నెలల పాటు ఆందోళనలు కొనసాగించారు. అనేక ఒత్తిళ్లు చేసినా కార్మికులు పోరాటాన్ని ఆపలేదన్నారు. విజయనగరం మిమ్స్ మెడికల్ కాలేజీ కార్మికులు 80 రోజుల పాటు పోరాటాలు చేశారు. 32 మందిపై అక్రమ కేసులు బనాయించారు. ఇద్దరు సిఐటియు నాయకులతో సహా 19 మంది కార్మికులను విశాఖ సెంట్రల్ జైలుకు 14 రోజులు రిమాండ్‌కు పంపారు. అయినా ఈ నిర్బంధాన్ని ఎదిరించి కార్మికులు పోరాటాన్ని కొనసాగించారు. నెల్లూరు మున్సిపాల్టీలో వర్క్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం టెంటర్లు పిలవడానికి వ్యతిరేకంగా కార్మికులు 14 రోజుల పాటు సమరశీలంగా సమ్మె నిర్వహించారు. పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని సమ్మెను జయప్రదంగా నిర్వహించారు. దీంతో ప్రభుత్వం టెండర్లను ఉపసంహరించుకోవడమే కాక, కార్మికులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయక తప్పలేదు. విశాఖ డెయిరీ కార్మికుల పోరాటం, సినర్జీస్ కార్మికుల సమ్మె, బ్రాండిక్స్ కార్మికుల మూడు రోజుల సమ్మె, రాజమండ్రి ఆంధ్రా పేపర్‌మిల్లు కార్మికులు 2,500 మంది 34 రోజుల సమ్మె, ఎన్‌టిఆర్ జిల్లా ముఠా కార్మికుల సమ్మెలు ఈ కాలంలో జరిగాయి. కార్మికులు పోరాటాలతో కొన్ని విజయాలు సాధించుకోగలిగారు. నెల్లూరులో జెన్కోను అదానీకి కట్టబెట్టే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 396 రోజుల ఆందోళనను కార్మికులందరూ కలసి నిర్వహించారు. కార్మికులు, ఇంజినీర్లు కలసి సిఐటియు చొరవతో జెఎసి గా ఏర్పడి పోరాడారు. ప్రజల మద్దతు పొందారు. ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి నెట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు 42 రోజుల పాటు ఎస్మాను సైతం ధిక్కరించి, నిర్బంధాన్ని ఎదురించి సమరశీలంగా సమ్మె నిర్వహించారు. గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్, రిటైర్మెంట్ వయసు పెంపు, హెల్పర్ల ప్రమోషన్‌కు వయోపరిమితి పెంపు, మినీ అంగన్‌వాడీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు, సమ్మె కాలపు వేతనాలు తదితర జీఓలను సాధించుకున్నారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు 16 రోజుల సమ్మెను సమరశీలంగా నిర్వహించారు. వేతన పెంపు, ఇతర సమస్యలు పరిష్కరించుకున్నారు. సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 22 రోజులు సమ్మె నిర్వహించారు. దాదాపు 8 వేల మంది ఉద్యోగులు 23 శాతం వేతన పెంపు, సమ్మె కాలపు వేతనాలు సాధించుకున్నారు. ఆశా కార్మికులు సమరశీలంగా అనేక పోరాటాలు నిర్వహించి గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్లు, ప్రసూతి సెలవులు, పదవీ విరమణ వయసు పెంపులను సాధించుకున్నారు. మధ్యాహ్న భోజనం, భవననిర్మాణం, ట్రాన్స్‌పోర్ట్‌తదితర రంగాల్లోనూపోరాటాలను నిర్వహించారు. రాజీ లేకుండా సమరశీలంగా ఫలితం వచ్చేదాకా పోరాడ్డం ద్వారా కార్మికవర్గం విజయాలు సాధించగలదని, ప్రభుత్వ విధానాలను వెనక్కి కొట్టగలదని తేటతెల్లమైందని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ పోరాటాల వలన ఆయా కార్మికుల్లో పోరాట స్ఫూర్తిని పెంచాయి. రాష్ట్రంలో, కేంద్రంలోప్రభుత్వాలు అవలంబిస్తున్నకార్మికవ్యతిరేక విధానాలను భవిష్యత్తులో ఐక్యపోరాటాల ద్వారానేతిప్పి కొట్టగలం అన్నారు.

## పదవ తరగతి పరీక్ష ఫలితాల టాపర్లకు సన్మానం




మాగనూరు (కృష్ణ ) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరచిన విద్యార్థులకు అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలో పదవ తరగతి టాపర్లను మండల విద్యాధికారి నిజాముద్దీన్, ఎస్సై నవీద్ సన్మానించారు. ఈ విజయానికి ముఖ్య భూమిక వహించిన మండల విద్యాధికారి, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులను తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. ఎస్సై నవీద్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ పట్ల గర్వంగా ఉందని వివరించారు. టాపర్లకు నగదు బహుమతులు, ఫిజిక్స్ పుస్తకాలను అందజేశారు. ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థిని ట్రాక్ చేస్తూ వారు జీవితంలో స్థిరపడే వరకు నిరంతర సహాయం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నాగరాజు, అర్జున్, కుర్మయ్య, నరేందర్, రమేష్, శివరాజ్, శాలిని, కే. శ్రీనివాస్, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన గురవన్నపేట సర్పంచ్ బుడిగె జహంగీర్ గౌడ్



కొమురవెల్లి తెలంగాణ వాణి ప్రతినిధి ఏప్రిల్. 30: కొమురవెల్లి మండలోని ప్రజాపాలనతో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు చూసి ఆకర్షితులై సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం లోని గురవన్నపేట గ్రామ సర్పంచ్ జహంగీర్ గౌడ్ జనగామ నియోజకవర్గం ఇంచార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి సమక్షంలో కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈరోజు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తుందని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు హామీ ఇవ్వని ఇతర సంక్షేమ పథకాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం అమలుకు కృషి చేస్తుందని తెలియజేశారు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా పేద ప్రజల బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడే పార్టీ అని తెలియజేశారు గ్రామాభివృద్ధి కోసం జహంగీర్ గౌడ్ పార్టీలో చేరడం గ్రామ అభివృద్ధికి బాట వేసినట్టు అయ్యిందని గ్రామ అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారాన్ని అందిస్తారని అలాగే గ్రామ సర్పంచ్ చేరిక పార్టీకి మరింత బలాన్ని చేకూర్చుతుందని తెలియజేశారు. సర్పంచ్ జహంగీర్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న సేవలు తనను ఆకట్టుకున్నాయని, గ్రామ అభివృద్ధి కోసం పార్టీలో చేరానని అధికార పార్టీ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తానని అలాగే ఇకపై పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, పి ఎసిఎస్ మాజీ ఛైర్మేన్ మెరుగు కృష్ణ, గురువన్నపేట గ్రామ శాఖ అధ్యక్షులు బ్రహ్మండ్లపల్లి చంద్రం, మాజీ ఎంపీటీసీ బుడిగే ఐలేని గౌడ్,మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బొచ్చు ఎల్లయ్య, మండల పార్టీ సేవాదళ్ అధ్యక్షులు బుడిగే అశోక్, మండల పార్టీ సెక్రటరీ బుడిగే బిక్షపతి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏర్పుల రాజు, గొదల నవీన్, బుడిగే హరీష్ మరియు మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో ప్రవీణ్

నాగిరెడ్డి పేట మండలం ఏప్రిల్ 30:(తెలంగాణ వాణి ప్రతినిధి) నాగిరెడ్డి పేట మండలంలోని పల్లె బొగడ తండా గ్రామంలో గురువారం రోజున ఉపాధి హామీ పనులను తనిఖీ చేయడానికి ఎంపీడీవో ప్రవీణ్ వచ్చారు . ఎంపిడిఓ ప్రవీణ్ కూలిలతో మాట్లాడుతూ.....ఈ రోజుల్లో నమోదవుతుంది ఎండ తీవ్రత నుండి తట్టుకునే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి . వడదెబ్బలకు గురి కాకుండా జాగ్రత్త వహించాలి. కొలతల ప్రకారం పనులను చేయాలని సూచించారు . ఇట్టి కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు .



## పదవ తరగతి ఫలితాల్లో ఆల్ఫోర్స్ ప్రభంజనం




నిర్మల్ – భైంసా: ఏప్రిల్ 30 (తెలంగాణ వాణి ప్రతినిధి): తెలంగాణ పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాల మరోసారి తన ప్రతిభను చాటుకుంది. పాఠశాలకు చెందిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి ఘన విజయం నమోదు చేశారు. ఈ ఫలితాల్లో బి.మనీషా,టి. మంజుశ్రీ తలో 582 మార్కులు సాధించి టాప్ స్థానంలో నిలిచారు. మొత్తం 58 మంది విద్యార్థుల్లో 48 మంది 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. ఈ విజయంపై ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారమే ఈ ఫలితాలకు కారణమని ఆయన పేర్కొన్నారు.

# సామాజిక చైతన్య స్ఫూర్తి..శ్రీశ్రీ !



కవులు ఎల్లప్పుడూ సమాజాన్ని మేల్కొలుపుతూనే ఉంటారు. సమాజ రుగ్మతలను ప్రశ్నిస్తూనే ఉంటారు. ప్రజలను చైతన్యం చేస్తూనే ఉంటారు. ఇలా ఎందరో తమ రచనల ద్వారా...సమాజహితం కోసం కవిత్వాన్ని రాస్తూ వస్తున్నారు. కాలమేదైనా తమకు అనుభవంలోకి వచ్చిన విషయాలను గమనించి వారు ఆయా కాలాల్లో ప్రజా చైతన్య దీపికలుగా వెలుగొందారు. అలాంటి వారిలో శ్రీరంగం శ్రీనివాసరావు ముందుంటారు. ఆయననే మనం శ్రీశ్రీగా పిలుచుకుంటాం. పాడవోయి భారతీయుడా అని శ్రీశ్రీ రాసిన ఓ సినిమా పాటలో స్వాతంత్ర్యం వచ్చెనని, సభలో పెట్టి, సంబరపడిపోకు అంటారు. అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు.. నిరుద్యోగ సమస్య ఇలా అన్నింటిని కలగలిపి రాసిన ఆ పాట నేటికి స్ఫూర్తి దాయకం. నిజంగా నేటికీ అది నిత్య నూతనం. కాలం మారింది. పాలకులు మారారు. కానీ పరిస్థితులు మారలేదు.

ఇవన్నీ కూడా ముందే ఊహించి రాసిన మహాస్రష్ట మన శ్రీశ్రీ. తొలినాళ్లలో సంప్రదాయ ఛందస్సుతో భక్తి గీతాలు రాసినా, వెండితెరపై భావుకత పండించే సినీ గీతాలు రచించినా.. ఆయన అసలు సిసలు రూపం మాత్రం సామాజిక చైతన్యం లోనే ఆవిష్కృతమైంది. తాను జీవించిన కాలం నాటి సమాజ అవసరాలకు, మార్పులకు అనుగుణంగా స్పందిస్తూ, తన కలాన్ని అభ్యుదయ పదం వైపు మళ్ళించిన తీరు సాటిలేనిది. మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు, అందరి ప్రీతిపాత్రమైన 'శ్రీ శ్రీ' జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం మన కర్తవ్యం. 1910 ఏప్రిల్ 30న విశాఖపట్నంలో జన్మించిన శ్రీ శ్రీ, తన అక్షరాలతో తెలుగు సాహిత్యానికి కొత్త దిశను చూపించిన విప్లవ కవి, హేతువాది, అభ్యుదయవాది. ఆయన రచనలు సామాన్యుడి జీవన సమస్యలను, సమాజంలోని అసమానతలను, అణచివేతలను ప్రతిబింబించి, చైతన్యాన్ని రగిల్చాయి. శ్రీ శ్రీ సాహిత్యం తెలుగు కవిత్వంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించి, సామాన్యుడి భాషలో, సమాజ సమస్యలను చర్చించే అభ్యుదయ కవిత్వానికి శ్రీ శ్రీ బాటలు వేశారు. ఆయన అత్యంత ప్రసిద్ధ రచన మహాప్రస్థానం (1950) తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచింది.

మరో ప్రపంచం, మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది! పదండి ముందుకు, పదండి త్రోసుకు! అంటూ కార్మిక, కర్షక, శ్రామిక వర్గాలను ఉత్తేజపరిచే ఈ కవితా సంపుటి, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని 'మహాప్రస్థానానికి ముందు, మహాప్రస్థానానికి తర్వాత' అని విభజించేలా చేసింది. శ్రీ శ్రీ కేవలం కవిగా మాత్రమే కాక, తెలుగు సినిమా పాటల రచయితగా కూడా తనదైన ముద్ర వేశారు. అల్లూరి సీతారామరాజు సినిమాలో తెలుగు వీర లేవరా, దీక్ష బూని సాగర అనే పాట తెలుగు సినిమా పాటకు జాతీయ స్థాయి గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ప్రాస, శ్లేష, అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడంలో శ్రీ శ్రీ మేటి. ఆయన పాటలు సందర్భానుసారంగా ఆలోచనను రేకెత్తించేలా ఉంటాయి. శ్రీ శ్రీ ఒక హేతువాది, నాస్తికుడు, అభ్యుదయ వాది. ఆయన అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా సామాజిక మార్పుకు కృషి చేశారు. 1955 సార్వత్రిక ఎన్నికలలో కమ్యూనిస్టుల తరఫున ప్రచారం చేసిన శ్రీ శ్రీ, 1969లో తెలంగాణ ఉద్యమ సమయంలో సమైక్యవాదాన్ని సమర్థిస్తూ ప్రదర్శనలు చేశారు.

వ్యక్తికి బహువచనం శక్తి అనే ఆయన వాక్యం సమాజంలో చైతన్యాన్ని నింపింది. రాజవీధుల్లో, పండితుల చర్చాగోష్ఠుల్లో, రాజదర్బారుల్లో మాత్రమే వెలుగొందిన తెలుగు సాహిత్యాన్ని సామాన్యుడి చెంతకు తీసుకొచ్చిన మహాకవి శ్రీ శ్రీ అని చెప్పనక్కర్లేదు. నాదొక స్వర్గం! అనర్గళం, అనితర సాధ్యం, నా మార్గం! అంటూ ఆయన చాటిన ఆత్మవిశ్వాసం, తెలుగు జనాన్ని చైతన్యవంతులను చేస్తోంది. ఆయన కవితలు పరుగులు పెడతాయి, సూదుల్లా గుచ్చుకుంటాయి, ఆలోచనను రేకెత్తిస్తాయి. ఆయన సాహిత్య ప్రస్థానాన్ని, బహుముఖీన వ్యక్తిత్వాన్ని ప్రముఖ సినీ కవి వేటూరి శ్రీశ్రీ పుట్టుకతో మనిషి, వృద్ధాప్యంలో మహర్షి, మధ్యలోనే కవి, ఎప్పటికీ ప్రవక్త అన్న వేటూరి మాటలు శ్రీశ్రీ జీవిత కాలక్రమానికి నిలువుటద్దం. సాహితీ లోకంలో ఎన్నో మార్పుల గాలులు వీయవచ్చు, సిద్ధాంతాల తుఫానులు చెలరేగవచ్చు, కానీ శ్రీశ్రీ అనే మహాకవి సృష్టించిన అభ్యుదయ భావజాలం అనే సంతకాన్ని ఏ గాలీ చెరిపేయలేదని, దానికి కాలమే కాపలాగా నిలుస్తుందని గుర్తించాలి. శ్రీశ్రీ దృష్టిలో కవిత్వం అంటే కేవలం పదాల పొందిక కాదు.

అది ఒక సామాజిక బాధ్యత. కవితా ఓ కవితా! నీ వెలుగుల వెంట పరుగెత్తుతా!' అని పాడుకున్నా, ఆ వెలుగును ఆయన సామాన్యుడి గుడిసెలో వెతకడానికే ప్రయత్నించారు. భావ కవిత్వపు సుకుమారత్వం నుండి 'మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది' అనే గర్జన వైపు సాగిన ఆయన ప్రయాణం ఒక చారిత్రక అవసరం. 'కాయకష్టం చేసేవాడికి, చెమట చుక్కలు చిందించేవాడికి నా కవిత్వం అంకితం' అని ప్రకటించి నప్పుడు, ఆయన కేవలం ఒక కవిగా కాకుండా సామాజిక విప్లవకారుడిగా అవతరించారు. కుల మతాల చట్రంలో ఇరుక్కుపోయిన సమాజానికి ఆయన అక్షరాలు ఒక శస్త్రచికిత్స వంటివి. 'జగన్నాథ రథచక్రాల్ వస్తున్నాయ్ వస్తున్నాయ్ పతితులార భ్రష్టులార బాధాసర్పదష్టులార' అంటూ ఆయన ఇచ్చిన పిలుపు సామాన్యుడి గుండెల్లో ఒక ధైర్యాన్ని నింపింది. ఒక కవిగా ఆయన తన సౌందర్యారాధనను కూడా శ్రమలో వెతుక్కున్నారు. అందుకే శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదు అంటూ శ్రామికుడి చెమట చుక్కలో ప్రపంచాన్ని చూశారు. అలాగే యువతను చైతన్య పరచడంలో శ్రీశ్రీ శైలి అనన్యం. సోమరితనాన్ని నిరసిస్తూ ఆయన చేసిన హెచ్చరిక ఇప్పటికీ మార్మోగుతూనే ఉంటుంది. ఎముకలు కుళ్లిన, వయస్సు మళ్లిన సోమరులారా చావండి.. నెత్తురు మండే, శక్తులు నిండే సైనికులారా రారండి! అని పిలుపునిచ్చినప్పుడు, ఆయనలోని ప్రవక్త స్పష్టంగా కనిపిస్తారు. గాలి ఎటు వీచినా, కాలం ఎటు మళ్లినా తన నిబద్ధతను మార్చుకోని ఆ అక్షర యోధుడు, నిప్పులు కురిపించే కన్నులతోనే వెన్నెల లాంటి స్వచ్ఛమైన అభ్యుదయాన్ని కలగన్నారు. కాలం మారుతున్నా, లోకం కొత్త పుంతలు తొక్కుతున్నా, తెలుగువాడి గుండె చప్పుడై వినిపించే శ్రీశ్రీ సంతకం అక్షర సత్యమై నిలిచి ఉంటుంది. నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను అని ప్రకటించిన ఆ మహనీయుడు, తన రచనల ద్వారా సామాన్యుడికి ఆత్మగౌరవాన్ని ప్రసాదించారు.

## ఫెర్టిలిటీ సెంటర్లపై తెలంగాణలో గుజరాత్ పోలీసుల సోదాలు



హైదరాబాద్ : 'ఆపరేషన్ దేవ్'లో భాగంగా తెలంగాణలో గుజరాత్ పోలీసులు వరుస సోదాలు నిర్వహిస్తుండటం సంచలనం సృష్టిస్తోంది. తాజాగా తెలంగాణ కేంద్రంగా సాగుతున్న భారీ శిశు విక్రయాల (జష్త్రఅశ్రీస ూత్మీటటఱఎఎఱఅష్త్ర) ముఠాను గుజరాత్ పోలీసులు రట్టు చేశారు. చిన్నారుల అక్రమ రవాణా చేస్తున్న ఫెర్టిలిటీ సెంటర్స్‌పై గుజరాత్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. చిన్నారుల అక్రమ రవాణా కేసులో అరెస్ట్ అయిన మురుగన్ గ్యాంగ్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సోదాలు చేపట్టారు. చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ గ్యాంగ్‌ను గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠా దేశవ్యాప్తంగా నవజాత శిశువులు, చిన్న పిల్లలను అపహరించి అక్రమంగా విక్రయించినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. మురుగన్ గ్యాంగ్ ఒక్క ఏడాదిలోనే 25 మంది చిన్నారుల విక్రయించినట్లు దర్యాప్తులో తేలింది. అలాగే మురుగన్ భార్య కృష్ణవేణి మరో గ్యాంగ్‌ను నడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. లోతైన దర్యాప్తు కోసం హైదరాబాద్‌కు చేరుకున్న గుజరాత్ పోలీసులు ఫెర్టిలిటీ సెంటర్లపై విచారణను ముమ్మరం చేశారు.

## దేవుళ్లతండా సమీపంలో లారీ-కారు ఢీ.. ఒకరు మృతి

మాల్, ఏప్రిల్ 30 : లారీ కారు ఢీకొని ఒకరు మృతి చెందగా ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన మాల్ మండల పరిధిలోని దేవుళ్లతండా సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లి నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ.. హైదరాబాద్ నుండి మల్లేపల్లి వెళ్లున్న కారు ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాలైన ఇద్దరిని చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

## కొండెక్కిన కోడిగుడ్డు ధర

హైదరాబాద్,: ఇటీవల తగ్గినట్లే తగ్గిన గుడ్ల ధరలు.. మళ్లీ పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లో కేవలం 15 రోజుల్లోనే గుడ్ల ధరలు భారీగా పెరిగాయి.. ఒక్కో గుడ్డుకు రూ.3 మేర ధర పెరిగింది. కొన్ని రోజుల్లోనే ఆకాశాన్నంటుతున్న గుడ్ల ధరలు వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. దాదాపు రెండు వారాల క్రితం ఒక గుడ్డు ధర రూ.4 ఉండగా, ఇప్పుడు రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.7 కి చేరింది. మరికొన్ని ప్రాంతాల్లో 8 రూపాయాలు సైతం అమ్ముతున్నారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా రిటైల్ కిరాణా దుకాణాలలో ధరలు ఒకే విధంగా ఉండగా, హోల్‌సేల్ దుకాణాలు ఒక్కో గుడ్డును రూ. 6.30 చొప్పున అమ్ముతున్నాయి.కోళ్ల అధిక మరణాలు, ఉత్పత్తి తగ్గడం.. డిమాండ్ పెరగడం.. వేగంగా పెరుగుతున్న ధరలకు కారణమని కోళ్ల పెంపకందారులు పేర్కొంటున్నారు. "వేసవిలో, ఫారాలలో కోళ్ల మరణాల రేటు ఎక్కువగా ఉంటుంది. ఉత్పాదకత తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ, గుడ్లు, కోళ్ల మాంసానికి డిమాండ్ అలాగే కొనసాగుతుంది. సరఫరా తక్కువగా ఉండటంతో, నష్టాలను పూడ్చుకోవడానికి ఫారాలలో గుడ్లు, కోళ్ల ధరలను పెంచుతారు." అని రంగారెడ్డి జిల్లాలోని ఒక కోళ్ల ఫారం యజమాని తెలిపారు..సంవత్సరంలోని ఇతర నెలలతో పోలిస్తే వేసవిలో మరణాల రేటు 30 శాతం ఎక్కువగా ఉంటుందని మరో పౌల్ట్రీ ఫారం యజమాని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, మార్కెట్లో కోడి మాంసం ధర కిలోకు రూ.240 ఉండగా, లైవ్ బర్డ్ (బతికున్న కోడి) కిలో రూ.170కి అమ్ముతున్నారు. హైదరాబాద్ లో కేజీ చికెన్ రూ.240 నుంచి రూ.260 వరకు అమ్ముతున్నారు. గత వారం కేజీ చికెన్



రూ.280 నుంచి 300వరకు అమ్మారు.మల్లేపల్లిలోని చికెన్ షాప్ యజమాని మహ్మద్ నజీర్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా చికెన్ ధరలు కేవలం కొన్ని రూపాయలు మాత్రమే పెరిగాయని చెప్పారు. "వేసవిలో ప్రజలు వివిధ కారణాల వల్ల చికెన్ కొనడానికి దూరంగా ఉంటారు.. కాబట్టి చిల్లర అమ్మకాల డిమాండ్ తక్కువగా ఉంటుంది. హోటళ్లు, క్యాటరర్లకు జరిగే సాధారణ సరఫరాలకు ఎలాంటి ఆటంకం కలగలేదు," అని నజీర్ అన్నారు.కోళ్ల ఫారాలు రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధికంగా ఉన్నాయి.ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం కారణంగా ఎగుమతులు దెబ్బతినడంతో మార్చిలో గుడ్ల ధరలు తగ్గాయి. అయితే, అది స్వల్ప కాలం వరకే కొనసాగింది.. అయితే.. కొళ్ల మరణాలు.. డిమాండ్ పెరగడం వల్ల.. ముమ్మందు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని పౌల్ట్రీ ఓనర్స్ పేర్కొంటున్నారు.

## ఇక 3 గంటల్లో ముంబై

హైదరాబాద్, : హైదరాబాద్ నుంచి ముంబైకు 3 గంటల్లోనే చేరుకోవచ్చు. అవును.. ఈ రెండు ప్రాంతాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మించనున్నారు హైదరాబాద్-పుణె-ముంబై మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ రానుందని, దీనికి సంబంధించి ఇప్పటికే డీపీఆర్ కూడా పూర్తయిందని తెలిపారు. దాదాపు 761 కిలోమీటర్ల మేర ఈ రైలు కారిడార్ ఉంటుందని, డీపీఆర్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. ఈ కారిడార్‌పై కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టు పనులను వేగంగా మందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఇది అందుబాటులోకి వస్తే మూడు గంటల్లోనే రెండు నగరాల మధ్య ప్రయాణించవచ్చని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్, నాగ్‌పూర్ మధ్య వందే భారత్ రైలు అందుబాటులో ఉంది. హైస్పీడ్ రైలు కారిడార్ అందుబాటులోకి వస్తే వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది. హైదరాబాద్-ముంబై కారిడార్‌కు సంబంధించి మొత్తం 12 స్టేషన్లు ఉంటాయి. గరిష్టంగా గంటకు 330 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణిస్తాయి. ఎలివేటెడ్, అండర్‌గ్రౌండ్ సెక్షన్లను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వికారాబాద్ సమీపంలో 4.6 కిలోమీటర్ల పొడవైన భారీ టన్నెల్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే హైదరాబాద్ నుంచి ముంబైకు మెరుగైన కనెక్టివిటీ లభించడమే కాకుండా పారిశ్రామికంగా కూడా రాష్ట్రానికి ఉపయోగపడనుంది. ఒక ఎకనామిక్ గ్రోత్ కారిడార్‌గా ఇది ఉంటుంది. ఇక ఫ్యూచర్ సిటీ నుంచి చెన్నై, బెంగళూరు కారిడార్ల



పనులపై కూడా కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులతో సమీక్షించారు. ఫ్యూచర్ సిటీ నుంచి చెన్నై, బెంగళూరుకు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఉండనున్నాయి. ఫ్యూచర్ సిటీ-చెన్నై హైస్పీడ్ కారిడార్ అమరావతి మీదుగా వెళ్తుందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

బెంగళూరు కారిడార్ అనేది మన్ననూర్, సోమశిల మీదుగా వెళ్తుందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులు చేపడతామని, ఏపీ ప్రభుత్వం కూడా వీటికి పూర్తి సహకారం ఇస్తుందని తెలిపారు. వీటికి సంబంధించిన అలైన్‌మెంట్ ప్లాన్లను ఆయన పరిశీలించారు. సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరిపాక వీటిపై కీలక నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కావడానికి కేంద్రానికి పూర్తి సహకారం రాష్ట్ర ప్రభుత్వ తరపున అందిస్తామని స్పష్టం చేశారు. అటు సనత్ నగర్ టిమ్స్‌ను జూన్ 2న ప్రారంభించనున్నట్లు కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

## బీజేపీని నిండా ముంచుతున్న అన్నాడీఎంకే

చెన్నై, ఏప్రిల్ 30, : మిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ని పక్కన పెట్టింది. ఏఐడీఎంకే చెప్పినట్టుగా సీట్లకు ఒప్పుకొంది. అన్ని విధాలుగా.. అన్ని అంశాలలో రాజీ పడింది. వాస్తవానికి కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ.. బిజెపికి తమిళనాడులో ఏమి చేయలేని పరిస్థితి. అందువల్లే ఏఐడీఎంకే ఆడించినట్టు ఆడింది. ఇంత చేసినప్పటికీ ఏమైనా ఉపయోగం ఉందా అంటే.. అది పలుచూపుమేరలో కూడా కనిపించడం లేదు.ఎగ్జిట్ పోల్స్ లో ఏ సంస్థ కూడా ఏఐటీఎంకే అధికారాన్ని దక్కించుకుంటుందని ప్రకటించలేదు.. పీపుల్ పల్స్ నుంచి మొదలు పెడితే చాణక్య స్ట్రాటజీస్ వరకు ప్రతి సంస్థ కూడా తమిళనాడు రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వస్తుందని ప్రకటించాయి.

ఇక్కడ ద్రావిడ సెంటిమెంట్ ముందు జాతీయవాదం పనిచేయదని నిరూపించాయి. తమిళనాడు రాష్ట్రంలో 180 ప్లస్ సీట్లతో డిఎంకె కూటమి విజయం సాధిస్తుందని స్మార్ట్ పోల్ సంస్థ ప్రకటించింది. ఇందులో ఏ ఐ డి ఎం కే కూటమికి కేవలం 28 సీట్లు మాత్రమే వస్తాయని ప్రకటించింది. ఓటు షేర్ విషయంలో కూడా కేవలం 27.6 చేత మాత్రమే లభిస్తుందని స్పష్టం చేసింది. మాట్రిజ్ సంస్థ భిన్నమైన ఫలితాన్ని చెప్పినప్పటికీ.. ఈ సంస్థకు అంత గొప్పగా క్రెడిబుల్టి లేదు. ఈ సంస్థ ఏఐడీఎంకే కూటమికి 87 నుంచి 110 సీట్లు వస్తాయని ప్రకటించింది.యాక్సిస్ మై ఇండియా సంస్థ ఏఐడీఎంకే కూటమికి 22 నుంచి 32 స్థానాలకు వస్తాయని వెల్లడించింది.. చాణక్య స్ట్రాటజీస్ కూడా ఏఐడీఎంకేకు తమిళనాడులో అధికారం రాదని స్పష్టం చేసింది. ఈ కూటమికి కేవలం 50 నుంచి 65 స్థానాలు మాత్రమే వస్తాయని వెల్లడించింది. వాస్తవానికి బిజెపి అధినాయకత్వం తమిళనాడు విషయంలో అంతగా చొరవ చూపలేదని తెలుస్తోంది. వెస్ట్ బెంగాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రముఖంగా ప్రచారం చేశారు. అక్కడి ఓటర్లను ప్రభావితం చేయడానికి ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేశారు. కానీ అదే దూకుడు తమిళనాడులో కొనసాగించలేకపోయారు. పైగా బిజెపి రాష్ట్ర నేతలు ఇక్కడ తలా ఒక దిక్కుగా మారిపోయారు.అన్నామలై మాటకు విలువ లేకపోవడంతో ఆయన ఎన్నికల్లో టచ్ మీ నాట్ అన్నట్టుగా వ్యవహరించారు. కొత్త అధ్యక్షుడు లేకి వ్యాఖ్యలు చేసి.. తమిళ హీరో విజయ్ కి క్షమాపణలు చెప్పారు. ఇక ఏఐడీఎంకే నేతలు కూడా ఇష్టానుసారంగా సీట్ల కేటాయింపు జరిపారు. అత్యంత కఠినమైన సీట్లను బిజెపికి ఇచ్చారు. ఈ విషయాన్ని బిజెపి అధినాయకత్వంతో స్థానిక నాయకులు చెప్పినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా తమిళనాడు ఎన్నికల్లో ఏఐడీఎం కే కూటమి మరోసారి విఫల బృందంగా మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

## ధాన్యం కొనుగోళ్లను పక్కాగా నిర్వహించాలి

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బచ్చన్నపేట ఏప్రిల్ 30 : జిల్లాలో ఏర్పాటు చేసిన 234 ధాన్యం కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగాలని, ఇందుకు వ్యవసాయ, సివిల్ సప్లై తదితర శాఖల అధికారులు సమన్వయముగా పని చేయాలనీ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేటలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొనుగోలు అయిన ధాన్యం సెంటర్ లో ఉండకూడదన్నారు. ఏ రోజు కారోజు ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కాంటకి ఒక బ్యాచ్, లోడ్ చేసేందుకు ఒక బ్యాచ్ సిబ్బంది ని పెట్టుకొని వెంట వెంటనే ధాన్యం కొనుగోలు, రవాణా అయ్యేలా చూడాలన్నారు. ప్రతి సెంటర్ కి రవాణా కోసం వెహికిల్‌ని కేటాయించామని, లోడింగ్, అన్‌లోడింగ్ ఆలస్యం జరగకూడదన్నారు. గోనె సంచులు కూడా సరిపడా ఉన్నాయని.. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగడంలో నిర్వాహకులు బాధ్యతయుతంగా వ్యవహరించాలన్నారు. ధాన్యం కొనుగోలు, రవాణాకి సంబంధించి ఏ సమస్య అయిన తమ దృష్టికి వెంటనే



తీసుకు రావాలన్నారు. వేసవి ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉందని కేంద్ర నిర్వాహకులు వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే రైతులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు బచ్చన్నపేట మండలం చిన్నరామెంచర్ల గ్రామం పరిధి బచ్చన్నపేట లో ఉన్న న్యూ పెట్రోల్ బంక్ ని కూడా కలెక్టర్ ఆకస్మికం గా సందర్శించి పెట్రోల్, డీజిల్ నిల్వలను పరిశీలించారు.

# ప్రపంచ కార్మికులారా ఏకం కండి!

### మే డే: పోరాటాల స్ఫూర్తి - ఎర్ర జెండా విముక్తికి ప్రతీక

ప్రపంచ కార్మికులారా ఏకం కండి! ఈ నినాదం కేవలం ఒక పిలుపు మాత్రమే కాదు, శతాబ్దాల దోపిడీని ఎదిరించిన ఒక సమున్నత చైతన్యం. మే డే అంటేనే పోరాటాలు, త్యాగాల కలయిక. ప్రతి ఏటా మే 1వ తేదీన కార్మిక దినోత్సవం పేరుతో శుభాకాంక్షలు, ప్రసంగాలు, ఆర్భాటపు వాగ్దానాలు వినిపిస్తూనే ఉంటాయి. కార్మికుడి శ్రమ దేశ నిర్మాణానికి పునాది అని, సమాజ గమనానికి చోదక శక్తి అని చెప్పడం కొత్త విషయం కాదు. అయితే ఈ రొటీన్ మాటల వెనుక దాగి ఉన్న అసలు వాస్తవం ఏమిటి అనే ప్రశ్నను నేడు మనం తప్పించలేము. చట్టాలు ఉన్నా అవి అమలులోకి రాకపోతే, కార్మికుడికి న్యాయం ఎక్కడ జరుగుతోంది? కాగితాలపై నిగనిగలాడే హక్కులు క్షేత్రస్థాయిలో చెమట చిందే చోట ఎందుకు కనిపించడం లేదు? ఈ మే డే సందర్భంగా ఈ ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిన బాధ్యత శ్రామిక వర్గంపైనే ఉంది.

?అమెరికాలోని చికాగో నగరంలో ఏ ఎనిమిది గంటల పని దినం కోసం, ఏ మానవీయ హక్కుల కోసం అయితే కార్మిక వర్గం వీరోచిత పోరాటాలు చేసిందో, తమ రక్తాన్ని రోడ్లపై పారించి ప్రాణత్యాగాలకు ఒడిగట్టిందో, ఆ పోరాట ఫలితమే నేడు మనం జరుపుకుంటున్న మే డే. నూట నలభై సంవత్సరాల నుండి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఆనాడు చికాగో వీధుల్లో అమరవీరులు చిందించిన రక్తం నుండి ఉద్భవించినదే "ఎర్ర జెండా". ఈ ఎర్ర జెండా కార్మిక వర్గ సార్వత్రిక ఐక్యతకు, విప్లవ స్ఫూర్తికి మరియు అణచివేతపై తిరుగులేని నిరసనకు నిలువెత్తు ప్రతీక. ఎర్ర జెండా కేవలం ఒక వస్త్రం కాదు, అది శ్రామిక వర్గ సార్వభౌమత్వానికి మరియు దోపిడీ రహిత సమాజ స్థాపనకు ఒక దిక్సూచి. కానీ నేడు ఆ హక్కులను కాపాడుకోవడంలో కార్మికులు అదే చికాగో స్ఫూర్తితో పోరాటాలను కొనసాగించడం లేదనేది చేదు నిజం. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వర్గం మళ్ళీ కోరలు చాస్తోంది. కార్మిక వర్గం మేలుకోకపోతే, శతాబ్దాల పోరాటంతో సాధించుకున్న హక్కులు హరించుకుపోయి, మళ్ళీ ఆధునిక బానిసత్వంలోకి వెళ్లే ప్రమాద గంటికలు మోగుతున్నాయి.

?భారతదేశంలో కార్మికుల రక్షణ కోసం కనీస వేతనం, పని గంటల పరిమితి, భద్రతా నిబంధనలు వంటి అనేక చట్టాలు ఉన్నప్పటికీ, నేడు అవి ప్రశ్నార్థకంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు 'లేబర్ కోడ్స్' సంస్కరణల పేరుతో కార్మిక హక్కులను క్రమంగా కాలరాస్తున్నాయి. యాజమాన్యాలకు లాభం చేకూర్చేలా, కార్మికుడి గొంతు నొక్కేలా ఈ మార్పులు సాగుతున్నాయి. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో పారిశ్రామిక వృద్ధి, విదేశీ పెట్టుబడుల గురించి గొప్పగా ప్రచారం జరుగుతున్నా, క్షేత్రస్థాయిలో కార్మికుడి జీవితం ఎంత మెరుగుపడింది అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. నిర్మాణ రంగ కార్మికులు సంక్షేమ బోర్డుల్లో నమోదు చేసుకున్నప్పటికీ, వారికి అందాల్సిన ప్రయోజనాలు బ్యూరోక్రసీ కోరల్లో చిక్కుకుని ఆలస్యమవుతున్నాయి. చిన్న పరిశ్రమలు, గోదాములు, కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. అదనపు వేతనం లేని పని గంటలు, వేధింపులు, ఉద్యోగ భద్రత లేమి నేటి శ్రమ దోపిడీకి సజీవ సాక్ష్యాలు.

?కోవిడ్-19 సమయంలో వలస కార్మికులు వేల కిలోమీటర్లు నడిచి వెళ్లిన దృశ్యాలు మన వ్యవస్థలోని అసమానతలను కళ్లకు కట్టాయి. నేటి గిగ్ ఎకానమీ (డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు) పేరుతో వస్తున్న కొత్త పని సంస్కృతిలో కార్మికులకు కనీస గుర్తింపు కూడా దక్కడం లేదు. ఇక్కడ సమస్య చట్టాలు లేకపోవడం కాదు, పాలకవర్గాలకు వాటిని అమలు చేయాలనే చిత్తశుద్ధి లేకపోవడం. పెట్టుబడిదారులు మరియు పాలకులు ఒక్కటై కార్మికులను అణచివేస్తున్నారు. రష్యా విప్లవ నాయకుడు లెనిన్ స్ఫూర్తితో, సోవియట్ విప్లవ విజయంతో ప్రపంచవ్యాప్తంగా కార్మికులకు దక్కిన గౌరవం నేడు మృగ్యమవుతోంది. మతతత్వ రాజకీయాలు మరియు కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం పెరిగి, కార్మికుడిని కులం పేరుతోనో, మతం పేరుతోనో విడదీసి, వారి అసలైన సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారు. ప్రశ్నించే గొంతులను నిరంకుశంగా నొక్కేస్తున్నారు.

?మే డే అనేది కేవలం సెలవు దినమో లేక వేడుక చేసే పండగో కాదు, అది కార్మిక వర్గ ఆత్మగౌరవానికి సంకేతం. చట్టాలు కాగితాల మీద ఉండటం సరిపోదు, అవి పని ప్రదేశాల్లో అమలవ్వాలి. శ్రామికుడికి దక్కాల్సిన ఫలితం దక్కనప్పుడు అది దేశాభివృద్ధి ఎలా అవుతుంది? కాబట్టి, కార్మికుల హక్కులు కేవలం ప్రసంగాల్లో కాకుండా, వారి బ్రతుకుల్లో ప్రతిబింబించాలి. కేంద్రంలోని పాలకుల మతతత్వ, మనువాద రాజకీయాలను, కార్పొరేట్ అనుకూల విధానాలను ఎదిరించేందుకు ప్రతి కార్మికుడు ఒక సైనికుడిగా మారాలి. ఎర్ర జెండా సాక్షిగా కార్మిక వర్గమంతా కులమతాలకు అతీతంగా ఏకమై, విశాల ఐక్య సంఘటనగా ఏర్పడటమే నేటి తక్షణ కర్తవ్యం. అణచివేత ఎక్కడ ఉంటే అక్కడ తిరుగుబాటు తప్పదని నిరూపిస్తూ, పోరాటాల ద్వారానే మన హక్కులను కాపాడుకుందాం. దోపిడీ లేని సమాజం కోసం, శ్రామిక రాజ్య స్థాపన కోసం రాబోయే కాలంలో మరింత ఉధృతంగా ముందుకు సాగుదామని ఈ మే డే సందర్భంగా ప్రతిన బూనుదాం.



వ్యాసకర్త
గంగుల రాజిరెడ్డి
తెలంగాణ వాణి
జర్నలిస్ట్
సెల్:99083 51557
హనుమకొండ

## యాదగిరిగుట్టలో కొనసాగుతున్న నృసింహ స్వామి జయంతి ఉత్సవాల ముగింపు వేడుకలు



యాదాద్రి భువనగిరి: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో నృసింహ స్వామి జయంతి ముగింపు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి అలంకరణ సేవను గురువారం ఉదయం ఊరేగింపు చేపట్టారు. యాగశాలలోని ప్రత్యేక వేదిక పై అధిష్టింప జేశారు. ద్వార తోరణ, మూర్తి కుంభారాధన, చతుఃస్థానార్చన లక్ష్మీనృసింహ, సుదర్శన, గరుడ మూలమంత్ర హోమాలను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ద్వారకోరణ మాషబలి మహా పుర్ణాహుని చేపట్టి ఏకోత్తర సహస్ర కలశావీషేకము సహస్ర ఘటాభిషేక వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు అర్చన,తదుపరి వేదస్వస్తి, నృసింహ అవిర్భావము. ఋత్విక్ సన్మానము మహానివేధన, తీర్థ ప్రసాద గోష్ఠి ఉత్సవ పరిసమాప్తి చేపట్టనున్నారు. అనుబంధ పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయం, దబగుంటుపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నృసింహ జయంతి ఉత్సవాల సందర్భంగా ముగింపు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బీ. నరసింహ మూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం



గోదావరిఖని: గోదావరిఖని 5 ఇంక్లైన్ లో నివాసం ఉంటూ ఆటో నడుపుకొని కుటుం బాని పోషించుకుంటున్న ఆటో డ్రైవర్ కుమార్తె పెళ్లి గురువారం నిశ్చయం కాగా బుధవారం రాత్రి వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ (మెడికల్ అసోసియేషన్ ) సహకారంతో పెళ్లి కూతురు కుటుంబ సభ్యులకు మెడికల్ అసోసియేషన్ సభ్యుల చేతుల మీదుగా కూలర్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ డాక్టర్ కె. రాజేందర్ హాజరై మాట్లాడారు. గోదావరిఖని మెడికల్ అసోసియేషన్ సభ్యుల సహకారంతో వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ ఆడపిల్ల పెళ్లికి సహాయం కోరగానే తమ వంతు సహాయంగా కూలర్ అందించడం జరిగిందని తెలిపారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగం గా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవకార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ముందు ముందు తమ సభ్యుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వి.ఎస్.ఎస్.ఎస్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ మాట్లాడారు. ఆడబిడ్డ పెళ్లికి సహాయం కోరగానే స్పందించి గోదావరిఖని మెడికల్ అసోసియేషన్ సభ్యులు సహకారం తో ఆర్థిక సహాయం అందించినందుకు వారందరికీ తమ సంస్థ ద్వారా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని సురభి శ్రీధర్ తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహాయ సహకార అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని శ్రీధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ సభ్యులు పి. సతీష్ , పి. శ్రీనివాస్,ఎన్. కరుణాకర్ రెడ్డి, డి. విష్ణుమూర్తి, బి .రాజేందర్, ఇ. సురేందర్, కె.వెంకన్న, జె .చారి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ బాటిల్స్ దిక్కు..

## దాహాన్ని దోపిడీగా మార్చుకుంటున్న వ్యాపారులు



నల్గొండ, : హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, చిన్నచిన్న దుకాణాలు ఎన్నో కుటుంబాల జీవనోపాధికి ఆధారంగా నిలుస్తున్నాయి. అయితే ఇదే అవకాశాన్ని కొంతమంది వ్యాపారులు దుర్వినియోగం చేస్తూ ప్రయాణికులను బలవంతపు దోపిడీకి గురిచేస్తున్నారు.పలుచోట్ల బస్టాండ్లు, రహదారుల పక్కన ఉన్న హోటళ్లు, షాపుల్లో ఎంఆర్పీ ధర కంటే అధికంగా చార్జీలు వసూలు చేస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. పిల్లలు తినే బిస్కెట్ ప్యాకెట్లు, చిప్స్, నీటి బాటిల్స్ వంటి సాధారణ వస్తువులకే అధిక ధరలు చెప్పడంసాధారణమైపోయింది.పిల్లలు మారం చేయడంతో తల్లిదం డ్రులు ఎలాంటి వాదనలు చేయలేక తప్పనిసరై కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్ర యాణికులు వాపోతున్నారు. అలాగే టిఫిన్ సెంటర్లలో కూడా మామూలు ధరల కంటే ఎక్కువ మొత్తాన్ని వసూలు చేయడం ప్రయాణికులకు తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది.జాతీయ రహదారులలో ఉన్న హోటల్స్ లో, బస్టాండ్ లలో, దుకాణాలలో వేలాది మంది ప్రయాణికులు రోజు ఒకే సమస్యను ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కన ఉన్న కొంత మంది వ్యాపారులు ఎమ్మా ర్పీ ధరల కంటే అధిక ధరలకు వస్తువులను విక్రయించడం సర్వసాధారణంగా మారింది. దీనివల్ల సాధారణ ప్రజలు ముఖ్యంగా బస్సు ప్రయాణికులు కుటుంబాలతో ప్రయాణించేవారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలంలో తాగునీటి అవసరం పెరగడంతో వ్యాపారులు ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా ఉపయోగిం చుకుంటున్నారని వారు చెబుతున్నారు. ఎంఆర్పీ ధరపై అదనంగా రూ.5 నుంచి రూ 10 వరకు వసూలు చేస్తున్నారు. బిల్లులు ఇవ్వకుండా నగదు మాత్రమే తీసుకోవడం. ఇక్కడ రేట్లు ఇలానే ఉంటాయి అంటూ వినియోగదారులను బెదిరించడం సాధారణమైపోయింది. రాత్రి సమయాల్లో ఎక్కువ ధరలు వసూలు చేయడం.రహదారుల వెంట ఉన్న వ్యాపారులు కొంతమంది ఈ రకమైన అక్రమాలకు పాల్పడుతుండగా, బస్టాండ్లలో ఉన్నటువంటి దుకాణదారులు వాటర్ బాటిల్స్ పై, బిస్కెట్ ప్యాకెట్ చీప్ మొదలైన వాటిపై 5 నుండి 10 రూపాయల వరకు అదనంగా వసుళ్ళకు పాల్పడుతున్నారు. ప్రశ్నించిన ప్రయాణికులకు మా షాప్ లో రేటు ఇంతే ఇష్టమైతే కొనండి లేదంటే వెళ్ళండి అని సమాధానం ఇస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.ప్రయాణికులు చెబుతున్నదేమిటంటే, దూర ప్రయాణాల్లో తప్పనిసరిగా ఆగాల్సి రావడం వల్ల ఈ దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. అప్పుడు వ్యాపారులు ఇదే అవకాశంగా తీసుకుని అధిక ధరలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. నీటి బాటిల్ మీద ఎంఆర్పీ రూ.20 ఉంటే రూ.25 తీసుకుంటున్నారు.అడిగితే ఇష్టం లేకపోతే కొనొద్దంటున్నారు అని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం ఎంఆర్పీ కంటే ఎక్కువ ధర వసూలు చేయడం చట్ట విరుద్ధం. ప్రతి వస్తువుపై ముద్రించిన గరిష్ట చిల్లర ధర ( ఎమ్మార్పీ) కంటే అధికంగా తీసుకోవడం నేరం. అయినప్పటికీ పర్యవేక్షణ లోపంతో ఇలాంటి అక్రమాలు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో పర్యవేక్షణ తక్కువగా ఉండటం, తనిఖీలు సరిగా జరగకపోవడం వల్ల వ్యాపారులు నిర్భయంగా అక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడూ తనిఖీలు చేసినా, కఠిన చర్యలు లేకపోవడం వల్ల పరిస్థితి మారడం లేదని అంటున్నారు. బస్టాండ్లు, హైవే హోటళ్లపై ఆకస్మిక తనిఖీలు చేయాలి. ఎంఆర్పీకి మించి వసూలు చేసే వారిపై జరిమానాలు విధించాలి. ప్రతి షాపులో ధరల జాబితా తప్పనిసరిగా ప్రదర్శించాలి. వినియోగదారుల ఫిర్యాదులకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నేషనల్ హెల్ప్లైన్ నెంబర్లకు 1800-11-4000 �& 1915 సమాచారం అందించినట్లయితే అధికారులు చర్యలు తీసుకుంటారు.జాతీయ రహదారులు ఉపాధి మార్గాలు మాత్రమే కాదు, ప్రజలకు సేవలు అందించే కేంద్రాలు కూడా. ఈ సేవలను దోపిడీగా మార్చే కొందరు వ్యాపారుల పై కఠిన చర్యలు తీసుకుంటేనే వినియోగదారులకు న్యాయం జరుగుతుందని, అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ధర దోపిడీపై సంబంధిత అధికారులు వెంటనే నిర్లక్ష్యం వీడి స్పందించి కట్టడి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది అని పలువురు వాపోతున్నారు.

# కార్మిక చట్టాలను కాలరాస్తున్న బిజెపి

### కార్మికుల పట్ల కనీస సానుభూతి లేని మోడీ
### హక్కులపై దాడి చేస్తున్నకేంద్ర ప్రభుత్వం
### సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి

జనగామ,ఏప్రిల్30 :కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలే మిన్నగా భావిస్తున్నదని సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ రాజిరెడ్డి అన్నారు. కార్మికుల పట్ల బిజెపికి కనీస సానుభూతి కూడా లేకుండా పోయిందన్నారు. మేడే సందర్భంగా ఆయన కార్మికులకు అభినందనలు తెలిపారు. కోట్లాది మంది కార్మికుల వేతనాలపై, ఉపాధిపై, హక్కులపై దాడి చేస్తున్నది. లేబర్‌కోడ్ల ద్వారా జాతీయ కనీస వేతనం పేరిట రోజుకు రూ.178 కన్నా తక్కువ వేతనాలు ఇవ్వకూడదంటున్నది. ఇంతకంటే ఎక్కువ వేతనాలను ఏ యాజమాన్యం ఆచరణలో చెల్లించదు. 300 లోపు కార్మికులు పని చేసే సంస్థలను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. ఈ 300 కార్మికుల సంఖ్యను తమ ఇష్టానుసారం పెంచుకునే హక్కును రాష్ట్రాలకు కట్టబెట్టింది.రాష్ట్రాల్లో ఉన్న వివిధ సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేసి గుత్తాధిపత్యాన్ని కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకున్నదని ఆరోపించారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో రెగ్యులర్ ఉద్యోగాలకు తిలోదకాలిచ్చే విధానాలను అమలు చేస్తున్నది. ఈ పేరిట అతి తక్కువ వేతనాలతో కార్మికులను దోపిడీ చేయడానికి కార్పొరేట్ యాజమాన్యాలకు బిజెపి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తున్నదని మండిపడ్డారు వీటికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో ఐక్య పోరాటాలు పెంచాల్సి ఉందన్నారు. సంఘటిత రంగ కార్మికులు సంక్షేమ పథకాలు, సమగ్ర చట్టం చేయాలని,ప్రభుత్వ పథకాల్లోని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, ఉపాధి హామీ, 108, 104, ఆయుష్, తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి వివిధ పథకాల్లోని వారిని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ చేశారు. ఈ పథకాల్లోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెచ్.ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేత రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి పని చేయించుకోవడం శ్రమ దోపిడీ అని, అందర్నీ రెగ్యులర్ చేయాలని అన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని అన్నారు. కార్మిక సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం చెల్లించాలని అన్నారు. శ్రామిక మహిళల హక్కులు కాపాడాలని, మహిళలకు నెలసరి సెలవులు ఇవ్వాలని, పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించి భద్రతా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### కూటమిని కూల్చేదాకా నిద్రపోను
### అంబటి రాంబాబు ప్రకటన

కడప,ఏప్రిల్30 : సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో మాజీ మంత్రి అంబటి రాంబాబు కడప జిల్లా వేంపల్లి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. సీఐ నరసింహులు ఆయన్ను విచారించారు. తెదేపా మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఫిర్యాదు మేరకు ఫిబ్రవరి 1న పోలీసులు అంబటిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం అంబటి రాంబాబు పులివెందుల బయలుదేరారు. తప్పుడు వాగ్దానాలతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని కూలదోసే దాకా తగ్గేదే లేదని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు. తనపై బనాయించిన అక్రమ కేసుల విచారణలో భాగంగా గురువారం ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కూటమి తీరుపై మండిపడ్డారు. తొలుత గండి వీరాంజనేయ దేవస్థానానికి వెళ్లిన అంబటి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇడుపులపాయలోని వైఎస్సార్‌ఘాట్‌ను సందర్శించి మహానేత రాజశేఖర్‌రెడ్డికి పూలమాలతో నివాళులర్పించారు.

# అందుబాటులోకి రాని స్విమ్మింగ్ పూల్స్



కరీంనగర్, : ప్రతి ఏటా వేసవిలో ప్రజల సౌకర్యార్థం కరీంనగర్ లో దాదాపు 6 చోట్ల ఈత కొలనుల నిర్వహణ చేపడుతున్నది.గడిచిన రెండు, మూడు రోజుల నుంచి వరుసగా ఈత కొలనులను ప్రారంభిస్తున్నరు. కరీంనగర్ అంబెద్కర్ స్టేడియం లో ఇప్పటికి 600 మంది వరకు పేరు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ పరంగా ఈ స్విమ్మింగ్ పూల్ ఉన్నా సామాన్యుని కి అందుబాటులో లేదు. వైరవిలు చేసుకున్న వారికి ప్రవేశం కల్పిస్తున్నా రు. పిల్లలకు 1300, పెద్దలకు 1600 రూపాయలు వసూలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం నాలుగు బ్యాచ్ లు బ్యాచ్ కు 40 మంది చొప్పున శిక్షణ ఇస్తున్నారు.కరీంనగర్ క్లబ్ తో పాటు సేంట్ జాన్స్ స్కూల్ తో పాటు మరో మూడు చోట్ల ఉన్న ఒక్కరికి 1500 నుండి 2000 రూపాయలు వసూలు చేస్తున్నారు.పాఠశాలలకు సెలవు లు ఇవ్వడంతో, పట్టణంలో ఈత శిక్షణ శిబిరాలు సందడిగా మారుతున్నాయి. తల్లిదం డ్రులు తమ పిల్లలతో కలిసి ఈ శిబిరాలకు తరలివస్తుండటంతో ఈ సందడి నెలకొందిజిల్లా యంత్రాంగంతో పాటు, ప్రైవేట్ పాఠ శాలలు మరియు వ్యక్తులు కూడా పిల్లలకు క్రీడలు, ఆటలు, చిత్రలేఖనం, చదరంగం, నృత్యం మరియు ఇతర ఈవెంట్లలో శిక్షణ ఇవ్వడానికి వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నారు.ఇతర క్రీడాంశాలలో, ఈతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుండటం తో ఇవి ఇటు క్రీడల శాఖకు, ప్రైవేట్ సంస్థలకు ఆదాయ వనరులగా మారి సామాన్య, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు అందని ద్రా క్షగా మారింది. అంబేద్కర్ స్టేడియంలోని ఈత కొలనునురూ.35 లక్షలు ఖర్చు చేసి పునరుద్ధరించింది. పెయింటింగ్తో పాటు, విద్యుత్ వైరింగ్, ఫిల్ట్రేషన్ పనులు చేపట్టారు. స్నానాల గదులు, దుస్తులు మార్చుకునే గదులు, షవర్లు, వాష్రూమ్లను కూడా పునరుద్ధరించారు.ఈ నిధులను ఈత కోసం వచ్చే వారినుండి గుంజే ప్రయత్నమే 500 ఉన్న రేటును మూడింతలు చేశారని కరీంనగర్ వాసులు అంటున్నారు.ప్రతి సంవత్సరం వేసవిలో నగరపాలక సంస్థ ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తుంది. 2017 నుంచి ఆరుసార్లు వేసవి శిక్షణ శిబిరాలను నగరపాలక సంస్థ నిర్వహించింది. ఈ సంవత్సరం విద్యార్థులకు వేసవి సెలవులు ప్రారంభమైనప్పటికీ నగరపాలక సంస్థ నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో క్రీడా శిక్షణ శిబిరాలు ఉన్నట్టా... లేనట్టా.. అనే సందేహం కలుగుతోంది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 2017 నుంచి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను జిల్లా క్రీడా శాఖ సహకారంతో నిర్వహిస్తోంది.వేసవి సెలవుల్లో ఇంటిపట్టునే ఉంటున్న చిన్నారులకు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉచిత శిక్షణను ఇచ్చారు. నగరపాలక సంస్థ ఇంతవరకు ఈ సంవత్సరం ఎలాంటి ఉచిత క్రీడా శిబిరాల నిర్వహణ ప్రకటన చేయలేదు. కొన్ని సంవత్సరాలుగా శిక్షణ శిబిరాలను విజయవంతంగా నిర్వహించిన బల్దియ ఈ సంవత్సరం ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విద్యార్థులకు నిర్వహించకపోవడం తో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ శిబిరాల నిర్వహణకు వెచ్చించాల్సిన వ్యయం పెరుగుతుండ డంతో నగరపాలక సంస్థ వెనకడుగు వేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# 'ఆశ' నిస్వార్థ సేవకు చిరునామా



సాంప్రదాయాల పేరుతో అనాదిగా ఎన్నో ఆచారాలు సమాజంలో పాతుకుపోయాయి. శ్మశానంలోకి మహిళల ప్రవేశం నిషేధం అందులో ఒకటి. అయితే ఎందరో మహిళలు ఈ ఆచారాన్ని సవాల్ చేశారు. అలాంటి వారిలో ఒకరే ఒరిస్సాకు చెందిన ఆశా బన్సిక. రాయగఢ్ జిల్లా హెడ్ క్వార్టర్స్ ఆస్పత్రిలో (డిహెచ్ హెచ్) 4త్ గ్రేడ్ ఉద్యోగిగా ఆమె విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్న ఉద్యోగిగా (నెలకు రూ.11,500) చాలా తక్కువ జీతానికే పనిచేస్తున్న ఆశ, మూడేళ్లుగా అనాథ శవాలకు స్వయంగా అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. దాదాపు 200లకు పైగా మృతదేహాలకు దహన సంస్కారాలు చేసిన ఆశ నిస్వార్థ సేవకు ప్రతిబింబం. ?సామాజిక కట్టుబాట్లు, పేదరికం కారణంగా ఎంతోమంది తమ ఆత్మీయులకు గౌరవప్రదమైన అంత్యక్రియలు చేయలేని నిస్సహాయతలో ఉంటారు. ఆ అనుభవం ఆశ స్వయంగా చూశారు. తను ఎంతో ఇష్టపడే తమ్ముడు చనిపోయినప్పుడు అతని అంత్యక్రియలకు డబ్బులు లేక ఆమె కుటుంబం ఎంతో కష్టపడింది. ఆ బాధ ఆమెను నిత్యం వెంటాడే బాధాకర జ్ఞాపకం.

తన జీవితంలో ఎదురైన చేదు సంఘటనలతోనే ఆశ ఈ సేవలో నిమగ్నమవుతున్నారు. హాస్పటల్ ఉద్యోగిగా వృత్తిగతంగా ఈ పని ప్రారంభిస్తే అది కేవలం జీతానికి చేసేది అవుతుంది. కానీ ఆశ ఈ సేవను వ్యక్తిగతంగా తీసుకున్నారు. అందుకే తన సొంత డబ్బులతో మృతదేహాలకు దహన సంస్కారాలు చేయిస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన నాటినుండే అనాథ శవాలపై ఆమె దృష్టి సారించారు. మార్చురీలో పేరుకుపోయిన మృతదేహాలను చాలా వాటిని గుర్తించారు. అనారోగ్యం కారణంగానో, ప్రమాదాల వల్లనో చనిపోయిన వారికి గౌరవప్రదమైన అంత్యక్రియలు చేయాలని నిశ్చయించుకున్నారు. అలా ఆశ ఈ బృహత్తర పనికి సమాయత్తమయ్యారు. సాధారణంగా ఈ క్రతువు జరిపించడానికి తక్కువలో తక్కువగా 2 వేల రూపాయలు ఖర్చు అవతుందని అంచనా వేస్తారు. చిన్న ఉద్యోగి అయిన ఆశకు అది భరించడం చాలా కష్టం. పైగా శ్మశానికి తీసుకెళ్లేందుకు వీలు లేకుండా కొన్ని శవాలు కుళ్లిపోయిన స్థితిలో కూడా ఉంటాయి. వాటి నిర్వహణ అదనపు భారం. అయినా ఆశ ఎక్కడా వెనుకాడరు. ఎప్పుడైనా తన దగ్గర డబ్బులు సమకూరనప్పుడు తన భర్త చిన్నా సాయం తీసుకుంటారు. ప్రైవేటు కంపెనీలో ఓ మోస్తరు ఉద్యోగం చేస్తున్న భర్త, ఇద్దరు పిల్లలతో ఉద్యోగం చేసుకునే ఆశ చేస్తున్న ఈ సేవ గురించి ఆమె ఇలా చెబుతుంది.

'జీవితంలో నాకు ఎదురైన చేదు సంఘటన ఎవరికీ రాకూడదు. తమ్ముడు పోయిన బాధ ఒకపక్క, మరోపక్క వాడిని శ్మశానానికి తీసుకెళ్లేందుకు కూడా మా దగ్గర డబ్బులు లేవు. కన్నీళ్లతో మా కుటుంబం డబ్బుల కోసం ఎంతోమందిని ప్రాధేయపడ్డాం. ఆ రోజులు ఇప్పుడు గుర్తు చేసుకున్నా నాకు కన్నీళ్లు ఆగవు. ఉద్యోగంలోకి చేరాక మార్చురీలో శవాలను చూసినప్పుడు నాకు అలాంటి దు:ఖమే పొంగుకొచ్చింది. అందుకే ఈ సేవలో నిమగ్నమవ్వాలనుకున్నాను. నా సేవకు కుటుంబం ఎంతో సహకరిస్తోంది. కాబట్టే ఈ పని చేయగలుగుతున్నాను- అని చెబుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్పటల్లో బంధువులు తీసుకెళ్లని శవాల జాబితాను తీసుకుని మరీ ఆశ ఈ సేవ చేస్తున్నారు. పేదరికంతో అంత్యక్రియలు నిర్వహించలేని మృతదేహాల వివరాలను కూడా సేకరిస్తుంటారు.

ఉద్యోగం చేసుకుంటూ తన సేవను కొనసాగిస్తున్న ఆశ ఒక్కోసారి శ్మశానంలో కొన్ని గంటలు ఉండిపోవాల్సి వస్తుంది. అలాంటప్పుడు సహకరించమని తోటి ఉద్యోగులకు సందేశం పంపుతారు. షిఫ్ట్ లు మార్చుకుని డ్యూటీకి వెళతారు. ఆ సయమంలో భోజనం చేయడానికి కూడా వీలు దొరకదు. నెల రోజుల క్రితం ఆశ చేసిన సేవ గురించి తెలుసుకుంటే తన అంకితభావం అర్థమవుతుంది. తెల్లవారుజామున 4 గంటలకు ఓ 50 ఏళ్ల మహిళ అనారోగ్యంతో చనిపోయిందని ఆశకు సమాచారం అందింది. ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ ముందుకురాలేదని తెలిసింది. ఏమ్రాతం ఆలస్యం చేయకుండా ఆశ అక్కడకు చేరుకున్నారు. ఆ అనాథ శవానికి గౌరవ్రపదమైన రీతిలో దహన సంస్కారాలు చేశారు. ఒక్కోసారి పేద కుటుంబాలకు కావాల్సిన డబ్బులు సమకూర్చి దహన సంస్కారాలు చేయిస్తారు. చాలాసార్లు తనే స్వయంగా ఈ పనికి పూనుకుంటారు. సందర్భం ఏదైనా 'చనిపోయిన వారికి గౌరవంగా అంతిమ సంస్కారాలు జరిగేలా చూడడమే నా లక్ష్యం- అంటున్న ఆశ 'నేను చేస్తున్న సేవ కొంతమందినైనా ఈ మార్గంలో నడిపిస్తే చాలు- అంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పోటీపడి మార్కులు తెచ్చుకున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



వనపర్తి, ఏప్రిల్ 30, (తెలంగాణ వాణి ప్రతినిధి ): వనపర్తి ప్రభుత్వ పాఠశాలలో మొదటి సంవత్సరం మార్కులు తెచ్చుకున్న జీవన్ సాయి 536 మార్కులు, గురు రాఘవేంద్ర 519 మార్కులు తెచ్చుకున్న విద్యార్థులను అలాగే బుద్ధారం ప్రభుత్వ పాఠశాలలో మొదటి మార్కులు తెచ్చుకున్న భారతి 518 మార్కులతో , పోల్కపాడులో ప్రభుత్వ పాఠశాలలో మొదటి స్థానం సంపాదించిన విద్యార్థిని మౌనిక లను ఘనంగా సన్మానించిన అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, పోల్కపాడు సర్పంచ్ బంగారయ్య, 22 వార్డు కౌన్సిలర్ భర్త శ్రీనివాసులు, బీఎస్పీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి మై బూస్, టిడిపి నాయకులు కొత్తగొల్ల శంకర్, సుంద రామస్వామి, ఖాజా వనపర్తి జెడ్పిహెచ్ఎస్ ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, రవీందర్ గౌడ్, నరేష్, గురు రాజు యాదవ్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు గాని తమ తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో కాకుండా ప్రభుత్వ స్కూల్లోని చదివించాలని వారిని మిగతావారు కూడా అనుసరిస్తారని ఎందుకంటే ప్రభుత్వ స్కూలల్లో నాణ్యవంతమైన టీచర్లు ఉంటారు. విద్యార్థులు డబ్బులు లేకుండా పాస్ అవుతున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో లక్షలు పెట్టి అన్యాయం అవుతున్నారు కనుక హైదరాబాదులో చదివించేవారు ఆలోచించి వనపర్తి లోనే చదివించాలని విజ్ఞప్తి చేశారు.

# మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం

### నూతన కోఆప్షన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్ చెరు, ఏప్రిల్ 30, (తెలంగాణ వాణి రిపోర్టర్); పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టించాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల పరిధిలో గురువారం నిర్వహించిన నూతన కోఆప్షన్ సభ్యుల ఎంపిక అనంతరం.. మున్సిపల్ పాలకవర్గం సభ్యులతో కలిసి నూతనకో ఆప్షన్స్ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమపై నమ్మకంతో కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికకు సంపూర్ణ సహకారం అందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎంతో నమ్మకంతో ఐదు మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారని.. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మున్సిపాలిటీల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్ ప్రమీల, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్లు హరీష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు అంతి రెడ్డి, రామచంద్రా రెడ్డి, వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిటైర్డ్ హెచ్ సి కి వీడ్కోలు



జగిత్యాల (తెలంగాణ వాణి ప్రతినిధి) ఉద్యోగ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ అశోక్ రావుకు ఎస్పీ అశోక్‌కుమార్ఆత్మీయ వీడ్కోలు పలికారు. పోలీస్‌శాఖలో గత 34సంవత్సరాలుగా విధులు నిర్వహించి ప్రస్తుతం గొల్లపల్లి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ అశోక్ రావు ను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోఎస్పీ అశోక్ కుమార్ పూల మాలవేసి శాలువలతోఘనంగా సన్మానించారు. సుధీర్ఘ కాలంగా పోలీస్ శాఖలో విధులు నిర్వహించి సేవలు మరువమని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీ వితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినా రు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ కిరణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీల సంక్షేమానికి పెద్దపీట

### పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అంగన్వాడి ఉపాధ్యాయులకు మొబైల్ ఫోన్ల పంపిణీ



పటాన్ చెరు, ఏప్రిల్ 30,(తెలంగాణ వాణి రిపోర్టర్): పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్‌చెరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. నియోజకవర్గ పరిధి లోని అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 153 మంది. ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అంగన్వాడి కేంద్రాన్ని డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ప్రతి అంగన్వాడి ఉపాధ్యాయురాలి కి మొబైల్స్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జయరాం నాయక్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, అంగన్వాడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### తెల్లాపూర్ గేటెడ్ కమ్యూనిటీల సమస్యలపై

# కమిషనర్ కి విజ్ఞప్తి

రామచంద్రపురం/తెల్లాపూర్ (తెలంగాణ వాణి) తెల్లాపూర్‌లోని ఉర్జిత్ గేటెడ్ కమ్యూనిటీలో స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, టెనా సభ్యులు, గేటెడ్ కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు. సిఎంసీ కమిషనర్ సృజన మేడమ్, శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, తెల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి మేడమ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే తెల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సీపీ రెడ్డి, కొల్లూరి భారత్ (మాజీ కౌన్సిలర్), బుచ్చిరెడ్డి (పాక్స్ మాజీ చైర్మన్), శ్రీశైలం (మాజీ కౌన్సిలర్), టెన సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. గేటెడ్ కమ్యూనిటీ సభ్యులు బాస్కర్ రెడ్డి, రాజేష్ గౌడ్, కిషోర్, మాధవ రెడ్డి తదితరులు కూడా పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీపీ రెడ్డి మాట్లాడుతూ తెల్లాపూర్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలలో ఎదురవుతున్న వివిధ సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రైనేజ్ వ్యవస్థలో లోపాలు, రోడ్లపై గుంతలు, తరచూ జరుగుతున్న ప్రమాదాలు, స్ట్రీట్ లైట్ల కొరత వంటి సమస్యలపై చర్చించారు. అదనంగా



రోడ్లపై భారీ వాహనాల రాకపోకల వల్ల కలుగుతున్న దుమ్ము ధూళి సమస్య, పబ్లిక్ యుటిలిటీ టాయిలెట్ల అవసరం వంటి అంశాలు ప్రస్తావించారు. చెరువులకు మురికి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే ఎస్టిపి లు సమర్థవంతంగా పనిచేయాలని సభ్యులు కోరారు. అధికారులు సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెల్లాపూర్ గేటెడ్ కమ్యూనిటీల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

## ఎన్నికల హామీల్లో భాగంగా నూతన వధూవరులకు 5వేల విరాళం ఇస్తున్న సర్పంచ్ పర్స రమేష్



జగిత్యాల /బుగ్గారం (తెలంగాణ వాణి) జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం శకల్ల గ్రామంలో సర్పంచి ఎలక్షన్లో భాగంగా గ్రామ ప్రజలకు హామీ ఇచ్చిన మేరకు ప్రతి ఆడపిల్లకు గ్రామంలో 5000 రూపాయలు నూతన వదువుకు కానుకగా ఐదు సంవత్సరాలపాటు నా పదవి కొనసాగేంతవరకు ఇస్తానని మాట ఇవ్వడంతో మాట తప్పకుండా ప్రతి పెళ్లి చేసుకునే ఆడపిల్లకి ఇస్తున్నానని ఈ సందర్భంగా శకల్ల గ్రామ సర్పంచి పర్స రమేష్ తెలియచేస్తు ఒడ్నాల శంకరయ్య వారి కుమార్తె రుత్విక హరీష్ వివాహానికి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ 5000/- రూపాయలు కానుకగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమేష్ తో ఏపూరి శ్రీనివాస్ వెలుగొండ తిరుపతి,శకల్ల నంది తిరుపతి,నంది శ్రీకాంత్, ఠాకూర్,ప్రశాంత్ సింగ్, వంశి, రాము,తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష అభిషేకం



రామచంద్రపురం/తెల్లాపూర్ – కొల్లూరు (తెలంగాణ వాణి ప్రతినిధి) నృసింహ జయంతి సందర్భంగా కొల్లూరు లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా దేవాలయంలో కొలువై ఉన్న సాలగ్రామ సహిత శ్రీ యోగ నరసింహస్వామి వారికి విశేష అభిషేకం నిర్వహించారు. ఉదయం వేళలో వేద మంత్రాల నడుమ పూజారులు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి స్వామివారిని అలంకరించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, హారతులు సమర్పించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని ఆశీర్వాదాలు పొందారు. నృసింహ స్వామి అనుగ్రహంతో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని ఆలయ అధికారులు ఆకాంక్షించారు.

# ఆటో దొంగను అరెస్ట్ చేసిన పోలీసులు

### 50వేల విలువైన ఆటో రికవరి




హసన్ పర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి)కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఆటో దొంగతనం కేసును పోలీసులు విజయవంతంగా చేధించారు. నేరస్తుడిని అరెస్ట్ చేసి, దొంగిలించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటోను దొంగిలించిన నేరస్తుడి పేరు పల్లకొండ రాజ్ కుమార్, (వయస్సు 29 సం:) కులం ఎరుకల వృత్తి ఆటో డ్రైవర్ మల్కపూర్ గ్రామం, రామగుండం మండలం, పెద్దపల్లి జిల్లాగా కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ యస్. రవి కుమార్ తెలిపారు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో జరిగిన ఆటో దొంగతనం కేసులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరస్తుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. భారీ వర్షాల సమయంలో నేరస్తుడు రెండు మూడు రోజుల పాటు పెగడపల్లి డబ్బాల ప్రాంతంలో సంచరిస్తూ, గుండ్లసింగారం రోడ్డులోని సుందరయ్య నగర్ కాలనీలో ఇంటి ముందు పార్క్ చేసిన ఎం పి 36టి ఎ 4027 నంబర్ గల ఆటోను రెక్కీ చేసి ఆటోను దొంగిలించి తన గ్రామానికి తీసుకెళ్లి కిరాయికి నడుపుతున్న సమయంలో పోలీసులకు చిక్కాడు. పోలీసులు ఆటోను రికవరీ చేసి నేరస్తుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు చేధనలో పాల్గొన్న సిబ్బంది యస్ ఐ విజయ్ కుమార్ ,సల్మాన్ పాషాహెడ్ కానిస్టేబుల్స్ అహ్మద్ పాషా, నర్సింగరావు,రవి ప్రసాద్ కానిస్టేబుల్స్ రాజశేఖర్, జితేందర్, సిబ్బందిని ఇన్స్పెక్టర్ రవి కుమార్ అభినందించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత, వేగంపై జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక దృష్టి

**ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణాలు గడువులోపు పూర్తి చేయాలని ఆదేశాలు**

భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) అన్నపురెడ్డి పల్లి మండలం పెంట్ల గ్రామంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో మొత్తం 46 ఇళ్లకు అనుమతులు మంజూరు కాగా, అందులో 13 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెంట్ల గ్రామంలో తాటి లక్ష్మి లబ్ధిదారుల ఇళ్లను ప్రత్యక్షంగా సందర్శించి నిర్మాణ నాణ్యత, పనుల పురోగతిని సవివరంగా పరిశీలించారు. లబ్ధిదారుతో నేరుగా మాట్లాడి ఇప్పటివరకు జరిగిన వ్యయం, ప్రభుత్వం నుండి విడుదలైన నిధులు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.



ఈ కార్యక్రమంలో తాసిల్దార్ స్వర్ణ, ఎంపీడీవో మహాలక్ష్మి, ఎంపీఓ షబానా, అగ్రికల్చర్ ఆఫీసర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

# సినిమా

## రాముడికి ఇచ్చిన మాట కోసం!



పానిండియా బ్లాక్‌బస్టర్ 'హను-మాన్'కి సీక్వెల్‌గా వస్తున్న మైథలాజికల్ అడ్వెంచర్ 'జై హనుమాన్'. సప్త చిరంజీవుల మేళవింపుతో కూడిన కథాంశంతో హాలీవుడ్ 'అవెంజర్స్'ని తలపించేలా దర్శకుడు ప్రశాంత్‌వర్మ తెరకెక్కిస్తున్న ఈ వెండితెర అద్భుతానికి కథానాయకుడు 'కాంతార'ఫేం రిషబ్‌శెట్టి. ఇందులో ఆయన వీరాంజనేయుడిగా కనిపించబోతున్నారు. రానా దగ్గుబాటి కీలక పాత్ర పోషించనున్నారు.

ఆ పాత్ర వివరాలను చిత్రబృందం గోప్యంగా ఉంచింది. ఇక శుక్రచార్యుడిగా అక్షయ్‌ఖన్నా.. ఇలా వివిధ పాత్రల్లో దేశంలోని పేరెన్నికగన్న తారలంతా ఈ సినిమాలో కనిపించబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఒక షెడ్యూల్‌ని పూర్తిచేసుకున్నది. మలి షెడ్యూల్ మొదలైంది. రిషబ్‌శెట్టి, రానా, అక్షయ్‌ఖన్నాలపై కీలక సన్నివేశాలను దర్శకుడు ప్రశాంత్‌వర్మ తెరకెక్కిస్తున్నారు.

రాముడికిచ్చిన మాట కోసం హనుమంతుడు చేసిన యుద్ధమే ఈ సినిమా అని ఇన్‌సైడ్ టాక్. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్న ఈచిత్రానికి సంగీతం: గౌర హరి.

## పర్యావరణ సంక్షోభంపై కాజల్ అగర్వాల్ ప్రయోగం..




ప్రపంచవ్యాప్తంగా ఎండల తీవ్రత పెరుగుతూ, గ్లోబల్ వార్మింగ్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్న ఈ సమయంలో, సినీ రంగం కూడా సామాజిక బాధ్యతను గుర్తుచేసే కథల వైపు అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో టాలీవుడ్ చందమామగా గుర్తింపు పొందిన కాజల్ అగర్వాల్ ఓ ఆసక్తికరమైన ప్రయోగంతో ముందుకు వస్తోంది. పర్యావరణ కాలుష్యం, వ్యవసాయ రంగంలో రసాయనాల దుర్వినియోగం, పురుగుమందుల అధిక వినియోగం వల్ల తలెత్తుతున్న ప్రమాదకర పరిస్థితుల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'ది ఇండియా స్టోరీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కేవలం ఒక కుటుంబం సమస్యగా కాకుండా, దేశవ్యాప్తంగా ప్రజారోగ్యం మరియు భద్రతను ప్రభావితం చేసే పెద్ద సంక్షోభాన్ని ఈ కథలో ప్రతిబింబించనున్నారు. ఈ చిత్రంలో పురుగుమందుల కుంభకోణాలు, వ్యవస్థలోని లోపాలు, నియంత్రణల లోటు వంటి కీలక అంశాలను ప్రస్తావిస్తూ, సమాజాన్ని ఆలోచింపజేసేలా కథను రూపొందించినట్లు నిర్మాత సాగర్ బి షిండే వెల్లడించారు. ఇది కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు, మానవాళికి ఎదురవుతున్న తీవ్రమైన సంక్షోభమని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్‌తో పాటు శ్రేయస్ తల్పాడే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరి నటన ఈ సినిమాను మరింత బలంగా నిలబెడుతుందని చిత్ర వర్గాలు భావిస్తున్నాయి. దర్శకత్వ బాధ్యతలను చేతన్ డికె చేపట్టగా, కథను కూడా సాగర్ బి షిండే అందించారు. జీ స్టూడియోస్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రం జూలై 24న థియేటర్లలో విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఒకేసారి విడుదలకు సిద్ధమవుతోంది. సినిమాటోగ్రఫీని నిశాంత్ భాగవత్ అందించగా, సంగీతాన్ని మంగేష్ ధక్డే సమకూరుస్తున్నారు. సామాజిక అంశాలను ప్రధానంగా తీసుకుని రూపొందిన ఈ సోషియో-నేషనల్ డ్రామా ప్రేక్షకులను ఆలోచింపజేయడమే కాకుండా, వినోదాన్ని కూడా అందిస్తుందని చిత్ర యూనిట్ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఇక కాజల్ అగర్వాల్ కెరీర్ విషయానికి వస్తే, కమర్షియల్ సినిమాల నుంచి కాస్త దూరంగా వెళ్లి, లేడీ ఓరియెంటెడ్ మరియు సామాజిక స్పృహ కలిగిన కథలపై ఎక్కువగా దృష్టి పెడుతోంది. కుటుంబ జీవితాన్ని సమతౌల్యంగా కొనసాగిస్తూ, నటిగా తన ప్రయాణాన్ని కొత్త దిశలో తీసుకెళ్తోంది.

## 57 ఏళ్ల వయసులో ప్రేమకు కొత్త నిర్వచనం..



వెండితెరపై కరుడుగట్టిన విలనిజంతో ప్రేక్షకులను భయపెట్టిన ప్రముఖ నటుడు రాహుల్ దేవ్ ఇప్పుడు తన వ్యక్తిగత జీవితంతో వార్తల్లో నిలిచారు. దశాబ్దాలుగా స్టైలిష్ విలన్‌గా గుర్తింపు పొందిన ఆయన, ప్రస్తుతం 57 ఏళ్ల వయసులో తనకంటే 18 ఏళ్లు చిన్నదైన నటి, మోడల్ ముగ్ధా గోడ్సేతో పదేళ్లుగా సహజీవనం చేస్తుండటంతో సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. రాహుల్ దేవ్ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు ఉన్నాయి. 2009లో ఆయన భార్య రీనా దేవ్ క్యాన్సర్‌తో మృతి చెందడం ఆయనను తీవ్రంగా కలిచివేసింది. ఆ సమయంలో కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పటికీ, తన కుమారుడి బాధ్యత కోసం సినిమాలకు కొంతకాలం దూరమయ్యారు. ఒక తండ్రిగా తన బాధ్యతలను నిర్వర్తించిన అనంతరం, 2013లో ఒక స్నేహితుడి పెళ్లిలో ముగ్ధా గోడ్సేతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమంగా స్నేహంగా, తర్వాత ప్రేమగా మారింది. ముగ్ధా గోడ్సే 'మిస్ ఇండియా 2004' సెమీ ఫైనలిస్ట్‌గా నిలిచిన వ్యక్తి. అలాగే ఫ్యాషన్ సినిమాతో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. వీరిద్దరి మధ్య 18 ఏళ్ల వయసు తేడా ఉన్నప్పటికీ, యోగా, ఫిట్‌నెస్, ఆధ్యాత్మికత పట్ల ఉన్న ఆసక్తి వీరిని మరింత దగ్గర చేసింది. "ప్రేమకు వయసుతో సంబంధం లేదు" అంటూ ట్రోల్స్‌కి రాహుల్ దేవ్ తరచూ సమాధానం ఇస్తుంటారు. ఢిల్లీలో జన్మించిన రాహుల్ దేవ్, 2000లో వచ్చిన ఛాంపియన్ సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. తొలి సినిమాతోనే ఉత్తమ విలన్ విభాగంలో గుర్తింపు పొందిన ఆయన, ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. తెలుగులో ఆయన విలనిజం ప్రత్యేక స్థానం సంపాదించింది. సింహాద్రి సినిమాలో బాలా నాయర్ పాత్ర ఆయనకు విశేషమైన గుర్తింపు తీసుకువచ్చింది. అలాగే అతడు సినిమాలో ప్రొఫెషనల్ కిల్లర్‌గా కనిపించి ప్రేక్షకులను మెప్పించారు. 'ఆంధ్రావాలా', 'మున్నా', 'జై చిరంజీవ', 'టక్కరి దొంగ' వంటి చిత్రాల్లో తనదైన స్టైల్‌తో టాలీవుడ్‌లో టాప్ విలన్‌గా నిలిచారు. రాహుల్ దేవ్ అంటే నటనతో పాటు ఆయన అద్భుతమైన ఫిజిక్ కూడా గుర్తుకు వస్తుంది. 57 ఏళ్ల వయసులో కూడా యువ హీరోలకు పోటీగా సిక్స్ ప్యాక్ బాడీని మెయింటైన్ చేస్తూ ఫిట్‌నెస్ ఐకాన్‌గా నిలుస్తున్నారు. క్రమశిక్షణ, వ్యాయామం, యోగా ఆయన జీవనశైలిలో భాగమయ్యాయి. తెలుగు, హిందీతో పాటు మొత్తం తొమ్మిది భాషల్లో 100కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన, ప్రస్తుతం ఓటీటీ వేదికలపై కూడా సత్తా చాటుతున్నారు. 'ది ఎంపైర్', 'పాయిజన్' వంటి వెబ్ సిరీస్‌లలో తన నటనతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఇక రాహుల్ దేవ్ తమ్ముడు ముకుల్ దేవ్ కూడా తెలుగు ప్రేక్షకులకు పరిచితుడే. ఇటీవల ఆయన మరణం రాహుల్‌ను కలచివేసినా, వృత్తిపరంగా తన బాధ్యతలను కొనసాగిస్తున్నారు. తెరపై విలన్‌గా భయపెట్టే రాహుల్ దేవ్, నిజ జీవితంలో మాత్రం ఒక బాధ్యతాయుతమైన తండ్రిగా, క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా, ప్రేమకు కొత్త అర్థం చెప్పే వ్యక్తిగా నిలుస్తున్నారు.

## ప్రేమలో పూజా హెగ్డే..



బుట్ట బొమ్మ పూజా హెగ్డే ప్రేమలో పడిందా? అంటే.. బాలీవుడ్ వర్గాల్లో అవుననే మాటే వినిపిస్తోంది. కొన్ని రోజులుగా ఆమె ఓ కుర్రాడితో చెట్టాపట్టాలేసుకుని కనిపిస్తుండటంతో, బాలీవుడ్ మీడియా వర్గాలు.. ఆమె ప్రేమలో పడిందని, త్వరలోనే పెళ్లి కూడా చేసుకోబోతుందంటూ వార్తలు వైరల్ చేస్తున్నారు. ఈ వార్తలు చూసిన ఆమె అభిమానులు, ఆమెను ప్రేమలో పడేసిన కుర్రాడు ఎవరా? అని సెర్చింగ్ మొదలెట్టారు. ఈ సెర్చింగ్‌లో బయటికి వచ్చిన పేరే రోహన్ మెహ్రా. అవును, గత కొంతకాలంగా రోహన్‌తో పూజా హెగ్డే రిలేషన్‌లో ఉన్నట్లుగా టాక్ నడుస్తోంది. అందుకు కారణం వీరిద్దరూ పలు ప్రదేశాల్లో కలిసి కనిపించడమే. ఇదే టైమ్ అనుకుని, అసలు వీళ్లద్దరి మధ్య ఉన్న రిలేషన్ ఏంటా అని, వీరి పాత ఇన్‌స్టా పోస్ట్‌లు కూడా తిరగేస్తున్నారు. అలా తిరగేస్తుంటే అసలు విషయం బయటకు వచ్చింది. పూజా హెగ్డే బర్త్‌డేని పురస్కరించుకుని రోహన్ చేసిన ఇన్‌స్టా పోస్ట్‌ని వైరల్ చేస్తూ.. వాళ్లిద్దరూ రిలేషన్‌లో ఉన్నట్లుగా వార్తలు క్రియేట్ చేస్తున్నారు. ఆ వార్తలకు తగినట్టే.. ఇద్దరూ రెస్టారెంట్స్‌కు వెళుతూ మీడియాకు చిక్కుతున్నారు. వాస్తవానికి వీరిద్దరూ కలిసి ఒక్క సినిమా కూడా చేయలేదు. మరి ఎలా వీరికి పరిచయమైందనే కోణంలో కూడా బాలీవుడ్ మీడియా.. ఒక ముందడుగు వేసేసింది. వీరిద్దరికి ఉన్న కామన్ ఫ్రెండ్స్ ద్వారా పరిచయం ఏర్పడి, ఆ పరిచయం రిలేషన్ వరకు దారితీసిందట. త్వరలోనే వీరిద్దరూ తమ మధ్య ఉన్న రిలేషన్‌ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లుగా కథనాలు రాస్తున్నారు. చూద్దాం, మరి ఏం జరుగుతుందో? ఇదిలా ఉంటే, పూజా హెగ్డే ఫ్యాన్స్.. రోహన్ మెహ్రాపై మరోలా రియాక్ట్ అవుతుండటం విశేషం. కుర్రాడు కత్తిలా ఉన్నాడు.. పూజాకు సరైన జోడు.. అంటూ ఇద్దరూ కలిసున్న ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఒకప్పుడు టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా దుమ్మురేపిన పూజాకు ఇప్పుడు అవకాశాలే లేకుండా పోయాయి. ప్రస్తుతం 'జననాయగన్' సినిమాతో పాటు దుల్కర్‌తో చేస్తున్న సినిమా మాత్రమే ఆమె చేతిలో ఉన్నాయి. బాలీవుడ్‌లో మాత్రం ఈ భామ బిజీ నటిగానే కొనసాగుతోంది.

## 'పెద్ది' రిలీజ్ డేట్‌పై కొత్త అనుమానాలు..



మెగా హీరో రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమా విడుదల తేదీ మరోసారి మారే సూచనలు కనిపిస్తున్నాయి. మొదట మార్చి 27న విడుదల చేస్తామని ప్రకటించిన మేకర్స్, ఆ తర్వాత ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. అయితే ఆ తేదీకి కూడా సినిమా సిద్ధం కాలేకపోవడంతో జూన్ 25కి రిలీజ్‌ను షిఫ్ట్ చేశారు. తాజాగా ఇప్పుడు ఆ తేదీ కూడా మారవచ్చనే టాక్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా జూన్ 25న సినిమా విడుదల అవుతుందని అధికారికంగా ప్రకటించినప్పటికీ, అదే సమయంలో అఖిల్ అక్కినేని నటిస్తున్న లెనిన్ మూవీ జూన్ 26న విడుదలకు సిద్ధమవుతోంది. దీంతో బాక్సాఫీస్ వద్ద పెద్ద పోటీ నెలకొనే అవకాశాలు ఉన్నాయనే చర్చలు మొదలయ్యాయి. మొదట 'లెనిన్' సినిమాను మే 1న రిలీజ్ చేయాలనిభావించినప్పటికీ, 'పెద్ది' కోసం వాయిదా వేసినట్లు టాక్. కానీ ఇప్పుడు చరణ్ సినిమా ఒక రోజుముందే విడుదలకానుండటంతో, రెండు పెద్ద సినిమాలు బ్యాక్ టు బ్యాక్‌గా వస్తాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రీసెంట్‌గా నాగార్జున.. 'లెనిన్' ఫస్ట్ కాపీ చూసినట్లు చెప్పుకొచ్చారు. "కొత్త అఖిల్‌ను ప్రేక్షకులు చూడబోతున్నారు" అంటూ జూన్ 26 తేదీని గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. దీంతో అక్కినేని కుటుంబం ఈసారి వెనక్కి తగ్గేలా కనిపించడం లేదని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక చిరంజీవి - నాగార్జున కుటుంబాల మధ్య మంచి అనుబంధం ఉండటంతో, ఈ రెండు సినిమాలు ఒకేసారి రిలీజ్ అవుతాయా? అనే సందేహాలు మరింత పెరిగాయి. గతంలో ఒకసారి 'లెనిన్' వాయిదా పడిన నేపథ్యంలో, మళ్లీ అదే పరిస్థితి వస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ఇక ఇదే సమయంలో యష్ నటిస్తున్న టాక్సిక్ సినిమా విడుదల తేదీ మారడం 'పెద్ది'కి కొత్త ఆప్షన్‌గా మారింది. ముందుగా మార్చిలో విడుదల చేయాలని భావించిన ఈ చిత్రం, తర్వాత జూన్ 4కి వాయిదా పడింది. తాజాగా మళ్లీ మారే అవకాశాలు ఉండటంతో, అదే తేదీకి 'పెద్ది'ని తీసుకురావచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. సమ్మర్ హాలిడేస్ జూన్ మధ్యవరకు ఉండటంతో, జూన్ 25 కంటే ముందే రిలీజ్ చేస్తే కలెక్షన్లకు ప్లస్ అవుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌కు కూడా ఇది అనుకూలంగా ఉంటుందని అంటున్నారు. ఇక మెగా అభిమానులు మాత్రం 'టాక్సిక్' తేదీకి 'పెద్ది' రావాలని కోరుకుంటున్నారు. చూడాలి మేకర్స్ చివరకు ఏ తేదీని ఫైనల్ చేస్తారనేది.

## రూ.30,000 కోట్ల ఆస్తి వివాదం.. కరిష్మా కపూర్ పిల్లలకు ఊరట!



నటి కరిష్మా కపూర్ మాజీ భర్త, ప్రముఖ వ్యాపారవేత్త, దివంగత సంజయ్ కపూర్‌కు చెందిన రూ.30,000 కోట్ల వారసత్వ ఆస్తి వివాదంలో ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సంజయ్ కపూర్ ఆస్తులను విక్రయించకుండా వాటిని పరిరక్షించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఆయన మూడో భార్య ప్రియా సచ్‌దేవ్ కపూర్‌ను ఆస్తులు అమ్మకుండా, బ్యాంకు ఖాతాలను నిర్వహించకుండా నిలువరిస్తూ ఇంజంక్షన్ ఆర్డర్ మంజూరు చేసింది. సంజయ్ కపూర్‌కు ఆయన రెండో భార్య కరిష్మా కపూర్ ద్వారా కలిగిన సంతానం కియాన్, సమైరాలు ఈ కేసును దాఖలు చేశారు. తమ తండ్రి మరణానంతరం ఆయన మూడో భార్య ప్రియా సచ్‌దేవ్ ఒక నకిలీ వీలునామాను సృష్టించారని వారు ఆరోపించారు. అంతేగాక కోర్టుకు సమర్పించిన ఆస్తుల జాబితా అసంపూర్ణంగా ఉందని, పోలో క్రీడకు ఉపయోగించే ఖరీదైన గుర్రాలు, రోలెక్స్ వంటి విలాసవంతమైన వాచీలను అందులో చేర్చలేదని తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. కపూర్ కుటుంబానికి చెందిన అనేక స్థిరాస్తులు, అత్యంత విలువైన పెయింటింగ్స్‌ను కూడా ప్రియా కపూర్ దాఖలు చేసిన జాబితాలో చూపలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, వీలునామాపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రియా కపూర్‌పైనే ఉందని స్పష్టం చేసింది. ఒకవేళ భవిష్యత్తులో వీలునామా నకిలీదని తేలితే, అప్పటికే ఆస్తులు చేజారిపోతే వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని కోర్టు అభిప్రాయపడింది. అందుకే ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. గతేడాది జూన్‌లో 53 ఏళ్ల సంజయ్ కపూర్ లండన్‌లో పోలో ఆడుతూ మరణించారు. ఆయన మరణం గుండెపోటు వల్లే జరిగిందని తొలుత భావించినా, దీని వెనుక అంతర్జాతీయ కుట్ర జరిగి ఉండొచ్చని ఆయన తల్లి రాణి కపూర్ అనుమానం వ్యక్తం చేశారు. అయితే, బ్రిటన్ వైద్య అధికారులు మాత్రం అది సహజ మరణమేనని, గుండె సంబంధిత సమస్యలతోనే ఆయన చనిపోయారని ఆగస్టులో ధృవీకరించారు. ఈ వారసత్వ వివాదంలో ప్రియా కపూర్‌కు, సంజయ్ కపూర్ తల్లి రాణి కపూర్, సోదరి మందిరా కపూర్‌తో కూడా విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# కేసీఆర్ రీ లోడింగ్..



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో మరోసారి విద్యార్థి శంఖారావం వినిపించాలని గులాబీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. ఉద్యమ కాలంలో కేసీఆర్ పిలుపుతో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు ఎలాగైతే కదిలాయో.. అదే తరహా ఇంటెన్సిటీని ప్రస్తుత రాజకీయ పోరాటాల్లోకి తీసుకురావడమే లక్ష్యంగా బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రత్యక్షంగా రంగంలోకి రాకముందే విద్యార్థి లోకం రహదారులపైకి వచ్చింది. విద్యార్థుల పోరాటమే ఆనాడు రాజకీయ పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇప్పుడు అదే వ్యూహాన్ని కేసీఆర్ మళ్ళీ నమ్ముకున్నారు. ప్రతి కాలేజీలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగ కమిటీలను బలోపేతం చేయాలని, యువతను ఫుల్ టైమ్ పొలిటికల్ వారియర్స్ 'గా మార్చాలని ఆయన ఆదేశించడం వెనుక ఒక బలమైన కారణం ఉంది. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ యంత్రాంగం కొంత స్తబ్దుగా మారినా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయాలంటే విద్యార్థుల తెగువ అవసరమని ఆయన గుర్తించారు. అయితే, ఉద్యమ కాలం నాటి సెంటిమెంట్ వేరు, ఇప్పటి రాజకీయ అవసరాలు వేరు. ఆనాడు ప్రత్యేక రాష్ట్రం అనే ఏకైక లక్ష్యం విద్యార్థులను భావోద్వేగంతో ఏకం చేసింది. కానీ నేడు ఉపాధి కల్పన, ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ వంటి అంశాలే విద్యార్థి రాజకీయాలను శాసిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ వంటి వారి నేతృత్వంలో అసెంబ్లీ ముట్టడి, ఫీజుల బకాయిలపై నిరసనలు చేపడుతూ యాక్టివ్ అవుతున్నారు. కానీ, రాజకీయ ప్రయోజనాల కోసం చేసే పోరాటాలకు విద్యార్థులు ఏ మేరకు స్వచ్ఛందంగా కదులుతారనేది ప్రశ్నార్థకమే. కేసీఆర్ కేవలం నిరసనలకే పరిమితం కాకుండా, యువతకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు. కాలేజీ స్థాయిలోనే నాయకత్వ లక్షణాలు పెంచి, వారిని భవిష్యత్ ఎన్నికల ముఖచిత్రంగా చూపడం ద్వారా కొత్త రక్తాన్ని పార్టీలోకి ఎక్కించాలనుకుంటున్నారు. ప్రభుత్వంపై పోరాడే క్రమంలో విద్యార్థులు ఎదుర్కొనే కేసులను, సమస్యలను పార్టీ అండగా నిలబడి చూసుకుంటుందని భరోసా ఇవ్వడం ద్వారా వారిని యాక్టివ్ మోడ్ లోకి తీసుకురావాలని చూస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విద్యార్థుల్లో ఉన్న చిన్నపాటి అసంతృప్తిని కూడా వదులుకోకూడదని బీఆర్ఎస్ భావిస్తోంది. ప్రత్యేకించి విద్యా రంగానికి కేటాయింపులు, నిరుద్యోగ భృతి వంటి హామీలపై ఉన్న వ్యతిరేకతను విద్యార్థి కమిటీల ద్వారా క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం కేసీఆర్ మాస్టర్ ప్లాన్. విద్యార్థులు రోడ్లెక్కితే అది సృష్టించే ఇంపాక్ట్ మీడియాలోనూ, ప్రజల్లోనూ బలంగా ఉంటుంది. ఇది రాజకీయంగా బీఆర్ఎస్‌కు మళ్లీ పూర్వవైభవం తీసుకువస్తుందని ఆశిస్తున్నారు. విద్యార్థులను రాజకీయాల కోసం రోడ్లపైకి తీసుకురావడం కేసీఆర్ లాంటి చతురత కలిగిన నేతకు పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. కానీ, కేవలం ప్రభుత్వం పై విమర్శలకే పరిమితం కాకుండా, విద్యార్థుల కెరీర్‌కు బీఆర్ఎస్ ఏ రకమైన భరోసా ఇస్తుందనే స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది. రాజకీయ సమీకరణలు మారుతున్న తరుణంలో, ఈ విద్యార్థి కమిటీలు బీఆర్ఎస్‌కు ఏ మేరకు బూస్టర్ డోస్ గా మారుతాయో చూడాలి. ఏది ఏమైనా, కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సెగ పుట్టించడం ఖాయం అనుకోవచ్చు.

# గ్రామాలల్లో త్రాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్



చిగురుమామిడి ఏప్రిల్ 30 ( తెలంగాణ వాణి విలేఖరి ): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం, ఓ ఫంక్షన్ హాల్లో , కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ, కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సంక్షేమ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీటి వనరు లు వున్న బావులు, బోరింగు లకు , పైప్లైన్ వేసి నీరు సరఫరా చేయాలని మంత్రి తెలిపారు. గ్రామాలలో త్రాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలని ఆయన అన్నారు.చిగురుమామిడి మండలంలో 341 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుఅయినవి,అందులో 42 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయినావనీ,తెలిపారు.జూన్ 2 లోపు భారీగా ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం జరగాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. చిగురు మామిడి మండలంలో 280 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతుందని, రైతులకు అవగాహన కల్పించడానికి వ్యవసాయ అధికారులు రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.గ్రామాల్లో ప్రతి సర్పంచ్ 50 ఎకరాల్లో రైతులు ఆయిల్ ఫాం సాగు చేసేలా అవగాహన కల్పించాలని, ఆయిల్ ఫాం ద్వారా అధిక లాభాలు ఉంటాయని, కోతుల బెడద ఉండదని , ప్రకృతి విపత్తులతో ఇబ్బందులు ఉండవనే అంశాలు రైతులకు వివరించాలని తెలిపారు.విద్యుత్ లూస్ లైండ్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలో ప్రతి గ్రామాల్లో హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలని ,ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి,మాదక ద్రవ్యాలు నిరోధించడానికి పోలీసులు మండలాన్ని ఆదర్శంగా నిలపాలనీ, గ్రామాల్లో ఏ సమస్య ఉందో తెలుపడానికి ,ఆయా,గ్రామాల ప్రజలతో కమిటీ వేసి వారి దగ్గర నుండి వచ్చిన సమస్యలు ఇక్కడ చర్చించడం జరిగిందన్నారు. అధికారులు ప్రతి సమస్య పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసుకోవాలి. చిగురుమామిడి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలనీ,రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అనంతరం మండలంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మోడల్ స్కూల్ విద్యార్థులను, ఉన్నత పాఠశాల విద్యార్థులను ,శాలువాతో సత్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ , ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే,,ఏ ఏమ్ సి చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, డిపిఓ జగదీశ్వర్ టి ఆర్ డి ఓ శ్రీధర్ జెడ్పీ సీఈవో శ్రీనివాస్ కర్ణ రూరల్ ఏసిపి విజయ్ కుమార్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, చిగురుమామిడి విద్యుత్ ఏఈ ప్రకాష్,సర్పంచుల మండల పోరం అధ్యక్షుడు మార్క్ రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గికురు రవీందర్, సాంబారి బాబు, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పోలు సప్న,రేకొండ గ్రామ శాఖ అధ్యక్షుడు గజపాక సునీల్, వెంకట్ రాజయ్య, తాసిల్దార్ రమేష్, ఎంపీడీవో విజయ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ స్వరూపారాణి,వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్.



కోహెడ :ఏప్రిల్ 30 (తెలంగాణ వాణి విలేకరి): సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న పీసీసీ జనరల్ సెక్రటరీ సౌజన్య,మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, వివిధ గ్రామాల సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,వార్డు సభ్యులు,ఇతర ముఖ్య కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆఫ్ లైన్ నుండి ఆన్ లైన్ కి ఉండడం వల్ల రైతులకు ఇబ్బందులు రావడం వల్ల మళ్ళీ ఆఫ్ లైన్ లో కొనుగోలు కేంద్రాలు జరుగుతున్నాయి.కాంగ్రెస్ పార్టీ రైతులకు మనం అండగా ఉన్నామని తెలియడానికి ఐదుగురు సభ్యులతో కమిటీ వేస్తున్నాం. గ్రామాల్లో తాగునీరు సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూసే బాధ్యత మనది అధికారులతో సమన్వయం చేయడానికి ఈ అంశం మీద ఐదుగురు సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం.ప్రభుత్వం పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో మంచి అత్యుత్తమ ఫలితాలు వచ్చాయి.మనమంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నాం.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి.బడి బాట కార్యక్రమంలో భాగంగా అడ్మిషన్ల సంఖ్య పెంచేలా ఒక కమిటీ ఏర్పాటు చేయాలి.ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటెల చర్యలు తీసుకోవాలి.కోహెడ మండలంలో ప్రతి గ్రామంలో ఆర్వీఎం మెడికల్ కాలేజీ ద్వారా హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేస్తున్నాం. అందరూ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలి. గ్రామాల్లో ప్రతి బూత్ లో బిఎల్ఏ నియమించాలి ఓట్ల సవరణ సర్ ద్వారా బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారు.తొలగించే ఓట్లు జాగ్రత్తగా పరిశీలించారు.దొంగ ఓట్లు వచ్చిన అధికారుల దృష్టికి తీసుకోవాలి అని ఈ సమావేశంలో గ్రామాలు వేరు వేరుగా కూర్చొని సమావేశం ఎర్పాటు చేసుకొని గ్రామాల సమస్యలు,పెండింగ్ పనులు అంశాలు చెప్పడంతో పాటు ఐదు అంశాలపై ఐదుగురు సభ్యులతో కమిటీ ఇవ్వాలి.గ్రామాల్లో మండలాల్లో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలి ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి విసృతంగా తీసుకోవాలి అని తెలియజేశారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 30 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు తమ పంటలకు సరైన మద్దతు ధర లభిస్తుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రంలోని ధాన్యం కుప్పలు, రైతులకు కల్పించిన వసతులను ఆమె దగ్గరుండి చూశారు. కేంద్రంలో టార్పాలిన్లు, గన్ని సంచులు, తాగునీరు మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం వివరాలు, సన్న రకం వడ్ల రాక మరియు రైస్ మిల్లుల కేటాయింపు ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు.?అనంతరం కలెక్టర్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులు తప్పనిసరిగా ప్యాడీ క్లీనర్లను ఉపయోగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరించాలని అధికారులను ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు మాత్రమే పంపాలని, కొనుగోలు ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా సాగాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ అందిస్తోందని, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు మరియు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని అన్నారు.సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని,దీనివల్ల ఆయిల్ పామ్ పండించే రైతులకు విక్రయ సమస్యలు ఉండవని, మంచి లాభాలు వస్తాయని తెలిపారు. రైతులు సన్న రకం వడ్లు మరియు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ,సహకార అధికారి రామకృష్ణ, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ విజయ్ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జమ్డాలో 'పంట కుంట' పనులను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నార్నూర్, ఏప్రిల్ : 30 ( తెలంగాణ వాణి ): భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జల సంరక్షణ చర్యల్లో భాగంగా, నార్నూర్ మండలంలోని జమ్డా గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా 'పంట కుంట' (ఫామ్ పాండ్) నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఐటిడిఏ పీఓ మంద మకరంద్ తో కలిసి నూతనంగా నిర్మిస్తున్న నీటి రీఛార్జ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, వర్షపు నీటిని వృథా చేయకుండా భూమిలోకి ఇంకింపజేయడం ద్వారానే భవిష్యత్ అవసరాలకు నీటిని నిల్వ చేయగలమని స్పష్టం చేశారు. జమ్డా గ్రామంలో నిర్మిస్తున్న ఈ పంట కుంటలు రైతులకు వరప్రదాయినిగా మారుతాయని, వీటి ద్వారా భూగర్భ జల మట్టం పెరిగి సాగునీటి ఎద్దడి తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి రైతు తమ పొలాల్లో నీటి సంరక్షణ పద్ధతులను విధిగా పాటించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ నిర్మాణాల వల్ల స్థానిక బావులు, బోరు బావుల్లో నీటి నిల్వలు గణనీయంగా పెరుగుతాయని, ఫలితంగా వేసవి కాలంలో కూడా పంటలకు సాగునీరు అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ రవీందర్, ఎంపీడీవో పుల్లరావు, ఏంఆర్ఓ రాజలింగు, వివిధ శాఖల మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక రైతులు, పాల్గొన్నారు.

# హజ్ యాత్రికులకు ఘనంగా సన్మానం చేసిన..

# మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి



మక్తల్:ఏప్రిల్30(తెలంగాణ వాణి ప్రతినిది) నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణానికి చెందిన 12 మంది ముస్లిం మైనారిటీ సోదరులు సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి పవిత్ర హజ్ యాత్రకు బయలుదేరుతున్న సందర్భంగా మక్తల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు చిట్టెం రాంమోహన్ రెడ్డి సమక్షంలో ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది.ఇస్లాం ధర్మంలోని ఐదు ప్రధాన మూలస్తంభాలలో హజ్ యాత్ర ఐదవది మరియు అత్యంత పవిత్రమైనదని,ఆరోగ్యంగా మరియు ఆర్థికంగా సామర్థ్యం ఉన్న ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైనా ఈ తీర్థయాత్రను పూర్తి చేయాలని శాసనసభ్యులు ఈ సందర్భంగా గుర్తుచేశారు.
?యాత్రకు వెళ్తున్న 12 మంది యాత్రికులను సాదరంగా గౌరవించిన రాంమోహన్ రెడ్డి వారందరూ సురక్షితంగా వెళ్ళి తమ పవిత్ర కార్యాలను పూర్తి చేసుకుని విజయవంతంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు శ్రీనివాస్ గుప్తా, మహిపాల్ రెడ్డి,జె.చిన్న హన్మంతు, రాజుల ఆశిరెడ్డిలతో పాటు మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ ఎండి. అన్వర్ హుసేన్, గుర్లపల్లి సర్పంచ్ గాల్ రెడ్డి, అస్గర్ అలీ,గార్లపల్లి నర్సింహరెడ్డి మరియు ఎండి. మిరాజ్ తదితరులు పాల్గొని యాత్రికులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుక మక్తల్ పట్టణంలో మత సామరస్యానికి మరియు సోదరభావానికి నిదర్శనంగా నిలిచింది.

## టెన్త్ ఫలితాల్లో సత్తా చాటిన బిసి గురుకులాలు

### 96.02 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

### అభినందనలు తెలిపిన మంత్రి సవిత

అమరావతి,ఏప్రిల్30 : ఆంధ్రప్రదేశ్ పదో తరగతి ఫలితాల్లో ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నాయి. ఈసారి 96.02 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచాయి. ప్రభుత్వ పరిధిలో విద్యార్థుల సంఖ్యాపరంగా ఉన్న గురుకులాల్లో ఎంజేపీ సంస్థలు అగ్రస్థానంలో నిలవడం విశేషం. విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించేలా, నరవాడ ఎంజేపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు 596, 593 మార్కులు సాధించి విశిష్ట ఫలితాలు నమోదు చేశారు. మొత్తం 100 పాఠశాలల్లో 30 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం ఈ సంస్థల విద్యా ప్రమాణాలను మరోసారి నిరూపించింది. ఈ అద్భుత విజయంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది కృషి ఫలితంగానే ఈ మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. బీసీ విద్యార్థుల విద్యోన్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయని అన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న ప్రోత్సాహక చర్యల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని, బీసీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల తరపున వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంజేపీ బీసీ గురుకులాల ఈ విజయంతో ప్రభుత్వ విద్యా సంస్థలపై విశ్వాసం మరింత పెరిగిందన్నారు మంత్రి సవిత.. కాగా, ఈ ఏడాది 6,18,131 మంది టెన్త్ పరీక్షలు రాయగా.. 5,26,9654 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.. అంటే 85.25 శాతం ఉత్తీర్ణత సాధించారు.. బాలురు 82.68 శాతం పాస్ అయితే.. బాలికలు 87.9 శాతం పాస్ అయ్యి మరోసారి సత్తా చాటారు.

# గిరిజన సంస్కృతిని కాపాడుకుందాం..

# అనాథ బిడ్డలకు అండగా నిలుద్దాం

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

నార్నూర్,ఏప్రిల్ : 30 ( తెలంగాణ వాణి ): గిరిజన ఆర్థిక వ్యవస్థలో ఇప్ప పువ్వు కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. నార్నూర్ మండలం జామిడి గ్రామంలో జరిగిన 9వ ఇప్ప పువ్వు పండుగ, అనాథ పిల్లల సంక్షేమ అవగాహన సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన ఆర్థిక వ్యవస్థలో ఇప్ప పువ్వు కీలక పాత్ర పోషిస్తుందని, దీనిని శాస్త్రీయ పద్ధతిలో సేకరించి విక్రయించడం ద్వారా గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇటువంటి ఉత్సవాలు గిరిజన సంస్కృతిని భావితరాలకు అందిస్తాయని పేర్కొంటూ, ఐటిడిఎ ద్వారా రైతులకు, స్వయం సహాయక సంఘాలకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.అనంతరం, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "డి. సి. పి. యు.సర్వే – చట్టబద్ధమైన దత్తత" అవగాహన కల్పిస్తూ, జిల్లాలోని అనాథలు, వీధి బాలలను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా, కేవలం సి. ఏ. ఆర్. ఏ.ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని, అనధికారిక దత్తత చట్టరీత్యా శిక్షార్హమని హెచ్చరించారు. పిల్లలకు కుటుంబ ప్రేమానురాగాలను అందించడానికి 'ఫోస్టర్ కేర్' (తాత్కాలిక పెంపకం) పద్ధతిని ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా పిల్లల విద్యా, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని వెల్లడించారు. ఏదైనా ఇబ్బందుల్లో ఉన్న పిల్లలు కనిపిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar
MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com